# సంజీవి

ఆ టపాకు వెళ్ళాల్సిన ఉత్తరాల్ని ప్లైపు చేస్తూండగా—నిష్కారణంగా శేషుకు చనిపోయిన తల్లి జ్ఞాపకం వొచ్చింది. ఉదయంనుంచీ సాయంత్రందాకా తను ఆఫీసులో కష్టపడి పనిచేసి ఇంటికి చేరగానే తన కష్టానికి సానుభూతిగా తనను పలకరించే తల్లి! చిన్నతనం నుంచీ ప్రాణంలో ప్రాణంగా పెంచి—తన చదువుకు వంటలుచేసి డబ్బుపంపిన తల్లి! తనకు యీ చిన్న ఉద్యోగం దొరికినప్పుడు పట్టలేనంత ఆనందముతో ఆమె తనను దీవించిన రోజు అతనింకా మరచిపోలేదు. ఈ లోకంలో మొదటినుంచీ తనకు ఒక్కతే ఆత్మబంధువు. ఆమె పోయిననాటి నుంచీ తన ఏకాకిత్వం భరించరానిదైంది—

ఈ ఆలోచనల్తో అతనివేళ్ళు ఆడటం మానివేసినయ్. ఎలాగైనా యీ తలపుల్ని మళ్ళించాలని గట్టి ప్రయత్నం చేశాడు. అన్నీ తప్పులు పడ్డయ్. దొరచూస్తే తన ఉద్యోగానికే నీళ్ళధార! ఎంత ప్రయత్నించినా మనస్సున తిప్పుకోలేక పొయ్యాడు. అంతకన్న ఆ బాధాకరమైన ఆలోచనల్ని భరించటమే చాలా తేలికనిపించింది. ఉన్నట్టు వుండి కళ్ళవెంట నీరుకార నారంభించింది. నరాల బలహీనత్వం అధికమైంది. ఏ పనీ చెయ్యలేని స్థితికివొచ్చి ప్లైపు మెషన్

మీద తలవాల్చి వెక్కి వెక్కి యేడ్వ నారంభించాడు. తన మెషిన్ ఆగినా పక్క మెషన్లు ఆగలేదు.

పక్కకూర్చున్న తోటి గుమాస్తా ఈ తమాషాను భరించలేక మెల్లిగా కదిపాడు: "అప్పుడే పూర్తిచేశావా?... ఏమిటీ—ఏడుస్తున్నట్టున్నావ్?"

చప్పున అతనికి స్మృతి వచ్చింది. ఇదివాక ఆఫీసు అనీ, ఇంటికష్టాల్నీ, వ్యక్తిగత బాధల్నీ ఇక్కడ వెల్లడి చెయ్య కూడదనీ, కొన్నిగంటల బానిసత్వానికి మాత్రమే తను ఇక్కడ నియోగింపబడ్డాడనీ - జ్ఞాపకం వచ్చింది. తను ఇరవై మూడేళ్ళ లోకానుభవాన్ని సంపాయించిన విద్యావంతుడు—కష్టాలలో పెరిగి బాధకు అలవాటుపడ్డ వ్యక్తి—ఒకబజారు మనిషిలాగు ఇంతమందిలో ఏడ్వటం తలవంపనిపించింది. తన కష్టాల్ని చెప్పుకొని ఏడ్వటంలోకూడా అర్థం లేదు! ఎందుకంటే — ఒకరి కష్టాలు యింకొరికి అనవసరం.

"ఎబ్బే—లేదు..."అన్నాడు: ఏడుస్తూ, యేడవటం లేదని చెప్పుకోవాల్సిన సభ్యతను తను అనుసరించి తీరాలి,

"కళ్ళవెంట నీరు వొస్తూంటే—"

"బలహీనత"

తోటి గుమాస్తా నవ్వి తన పనిలో నిమగ్నుడయ్యాడు. శేషుకు పనిచెయ్య బుద్ధిపుట్టలేదు, ఇన్నాళ్ళూ భారమనిపించని జీవితం—తల్లి మరణించిన మరుక్షణంనుంచీ వెగటని

పించింది. లోకమంటే ఏమిటో—ఈ ప్రపంచంలో తన కోసం ఎంత కొద్ది ఆనందంవుందో అప్పుడే అర్థమైంది. ఆ క్షణంనుంచే అతనిలోని శక్తులు చాలాభాగం పనిచెయ్యటం మానివేసినయ్. సంఘటన తెచ్చే మార్పుకన్న, దాన్ని గూర్చిన ఆలోచన తెచ్చే చెరుపు ఎక్కువనటం అతని విషయంలో అబద్ధమవలేదు.

రెండు నెలల్క్రితం తల్లిపోయినా అది రెండు గంటల క్రితమే జరిగినట్టుంది — అతనికి. ఇలాంటి ఆలోచనల్తో అతను ఆరోగ్యాన్ని చెడగొట్టుకున్నాడు. మలేరియా జ్వరం ఘోరంగా వెంటపడ్డది. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. ఆ జ్వరం తీవ్రతను ఏకాంతంగా అనుభవించటం మరీ కష్టం. ఆ ఉష్ణతతో కాగిపొయ్యే తన ఫాలభాగాన్ని — మాతృప్రేమతో నిమిరే ఒక్క హస్తమన్నా తన కీలోకంలో లేదు. ఈ విధంగా జీవితంలో ఒక్కడై పోరాడేందుకు పిరికి పడుతూనే వున్నాడు.

ఆ జ్వరం మళ్ళీక్షణాల్లో శరీరాన్ని ఆవరించింది. తనతల్లే బతికున్నట్టయితే ఇదొక బాధేకాదు. తన హృదయాన్నంతట్నీ తల్లికే అర్పించటంవల్ల—ఆమె మరణం అతనిలో గొప్పమార్పును తెచ్చింది. మానవుడైనవాడు కోరదగిన కనీసపు కోర్కెల్లో తనకు లెక్కకు ఒక్కటి దక్కలేదు. ఈ విధి తనను చావానివ్వదు!బతకానివ్వదు—

గడియారం నాలుగుగంటలు కొట్టినా - అతను ఆలాగే శిలాప్రతిమలాగు మెషీన్ మీద ఆని, కన్నీరు కారుస్తూనే వున్నాడు. ఆఫీసు నౌకరువచ్చి దొర పిలుస్తున్నాడని చెప్పే దాకా అతనికి మతేలేదు.

"ఇంతవరకూ ఉత్తరాలురాలేదు-" అన్నాడు దొర.

"నాకు జ్వరం వచ్చింది."

"నీకు యిచ్చినవి చాలా అవసరమైన ఉత్తరాలు. నువ్వు రెండురోజుల కొకసారి జ్వరం తెచ్చుకుంటే ఆఫీసు దివాలా తీస్తుంది. రోగిష్టివాళ్ళకు జీతా లిచ్చేందుకు భాగస్తులు ఒప్పుకోరు."

"జ్వరం రావటం నా తప్పుకాదు."

"మరి మా తప్పా కాదు...నీతో లాభంలేదు."

"కొన్నాళ్ళు శెలవిప్పిస్తే—"

"శెలవిచ్చి కొద్దికాలానికి ఇంకోళ్ళను తెచ్చుకోవటం కష్టం. ఐనా యిది సర్కారు వుద్యోగం కాదని చీటికి మాటికీ ఎవ్వరూరారు. అంతకన్నా మానుకోరాదూ?"

"మానుకుంటాను—" అన్నాడు నిశ్చలంగా. ముందున్న కష్టాల సంగతే అతను ఆలోచించలేదు. దొర ముఖంలోకి దీనంగా ఇంతకన్న నన్నేమీ చెయ్యలేవుగా అన్నట్టుచూసి "మానుకుంటున్నాను" అని సమాధానాన్ని కూడా వినకుండానే ఎల్లాగో వీధిలో పడ్డాడు.

బండిలో ఇల్లుజేరి గదిలో పడుకొని ఆలోచనలో పడ్డాడు. ఇల్లంతా బావురుమంటూ 'నువ్వొఅద్దెయిస్తున్నావు; అంతకుమించిన హక్కు ఈ యింట్లో నీకేమీలేదు' అని తనను హేళన చేస్తున్నట్టుంది.

ఔను...తనకేముంది లోకంలో? ఎవరున్నారు? చివరకు వేడినీళ్ళుపెట్టే దిక్కున్నాలేదు. హోటల్‌వాళ్ళు తన పర్సుమీద ప్రేమకొద్దీ యింత అన్నంపెడతారు.తనకు కలిగే దుఃఖంకానీ ఆనందంకానీ తన ఒక్క హృదయమే భరించాలి; పంచుకునేందుకు ఇంకెవరూ లేరు. ఇంత లోకంలో తను ఒక్కడుగానే బతకాలంటే ఎంత కష్టం!

పూర్వపు సంగతులు అనేకం జ్ఞాపకం వొచ్చినయ్... తన తల్లి తనకొక సంబంధాన్ని అమిత కష్టంతో కుదిర్చింది. ఆమెను సంతోషపెట్టాలని—తను ఆ పెళ్ళికి ఒప్పుకున్నాడు. కాని అది పూర్తవక పూర్వమే ఆమె మరణించింది. వాళ్లు పిల్లను ఇచ్చేందుకు నిరాకరించారుకూడాను. పెళ్ళితనకింకా ఒక అవసరంగా తయారవక పోవటంవల్ల అది అంత కష్టమనిపించలేదు. కాని తను లోకానికి ఎంత పనికిరానివాడో ఇప్పుడు బాగా అర్థమైంది.

ఈ సాయంత్రమే తన ఉద్యోగంకూడా వూడింది. ఎంత కష్టపడి సంపాయించాడు యీ ఉద్యోగాన్ని! ఆ ఒక్క తల్లిని సంతోష పెట్టేందుకు తన జీవితాన్నంతట్నీ ధారపోయాలనుకున్నాడు. కానిఆతల్లే పోంగా లేంది యీఉద్యోగం

పోయినందుకు విచారం లేదు. అదీకాక తను నెలరోజులూ చెమటోడ్చి సంపాయించిన ముప్పైరూపాయిలూ—ఇంటి అద్దెకూ, చాకళ్ళకూ, హోటల్ వాళ్ళకూ—ఇంకా ఇలాంటి ఖర్చులకే సరి! తను సంపాయించేదంతా వీళ్ళకోసమా? తన కేమంత అవసరం?

జీవితంలో సంతోషమూ, ఆనందమూ లేదు. ఇంత భారాన్నీ లాగుతూ 'ఏదో బతుకుతున్నాం' అన్నట్టు చప్పగా తయారైంది—బతుకు-తనలాగే ఎన్నో జీవులు-జంతువులూ, పక్షులూ బతుకుతున్నయ్. అవి తనకన్న అతి తేలిగ్గా నిర్విచారంగా, ఆనందంగా బతకగలుగుతున్నయ్! అవి ఎందుకు బతుకుతున్నయ్యో, ఎవర్ని ఉద్ధరించేందుకో వాటికే తెలియదు. మనుషులు కూడా అంతే! ఈ బతుకంతా ఒక్క సదవకాశంకోసమే కావచ్చు. అది ఇతరులపట్ల ఎంత నిజమోకాని—శేషుకుమాత్రం ఇది శుద్ధ అబద్ధంలాగు కనిపించింది.

ఆరోగ్యంకూడా పాడైంది. సాయంత్రం జ్వరం రావటమూ, రాత్రల్లాదాంతో బాధపడుతూ కూర్చోవటమూ రెండు నెల్లనుంచీ క్రమం తప్పకుండా జరుగుతోంది. ముఖమంతా తెల్లబడ్డది. తిని కూర్చునేభాగ్యం తనకు లేదు. మందులకూడానా? బీదవాడై పుట్టటంలోఎంత బాధ! తన రోజులు నిండినయ్యనే మాట జ్ఞాపకంరాని రోజులేదు. కాని ఆ చావు ఎప్పుడు వొస్తుందో తెలియదు. ఆ చావును తనకు

తానై తెచ్చుకుంటే—కనీసం చచ్చయినా సుఖపడవచ్చు!

ఇహలోకం మీద ఆశలను పరలోకాలమీదికి పోనివ్వ టం రోజూ జరుగుతూనేవుంది; కాని యీనాటి ఆలోచన పూర్వపువాటికన్న అనేకరెట్లు బలమైంది. ప్రతిరోజూ దాన్ని తరిచి తరిచి ఆలోచిస్తూండటంవల్ల ఆత్మహత్యను చేసుకోలేకుండా వున్నాడు. ఇంకా ఆలోచిస్తే అసలు ఆ నిర్ణ యమే పోతుందేమో?

మెల్లిగా లేచి బైటపడ్డాను...ఆత్మహత్య!...అది తలు చునేప్పటికే అతనికి విపరీతమైన భయం కలిగింది...చావు తెలిసివస్తే భరించలేనంత భయమేనేమో?...కాని అంత కన్న తనుజీవితంలో చెయ్యగలిగే ఘనకార్యం మాత్రం ఏముంది? అతనికి జీవితం మీద కలిగిన అసహ్యమంతా మళ్ళీ చద్దామనే నిర్ణయానికే దారితీసింది. మనసును సమా ధాన పరుచుకున్నాడు.

ఎలాచస్తే బాగుంటుందనేది సమస్యయింది; రైలూ, నీళ్లూ, కాళ్లూ, బళ్లూ,...ఎన్నో గుర్తువచ్చినయ్.

పట్టణపువీథుల్లో దేదీప్యమానంగా విద్యుద్దీపాలు వెలుగు తున్నయ్. మనుషు లందరూ కాలం వృథాపోతుందేమో నన్నట్టు చకచకా సాగిపోతున్నారు, కార్లూ, ట్రాములూ, రిక్షాలూ, బళూవడివడిగా పరుగులెత్తుతున్నయ్. వీళ్ళందరూ అనుభవించే ఆనందం తనకేనా లేంది?...ఐనా చావబోయ్యే తనకు యీ ఆలోచన అనవసరం!

బర్రున పరుగెత్తుకొస్తూన్న కారు కింద పడదామని నిర్ణయించుకున్నాడు. రాయిచేసుకున్న గుండెతో—ఇక ఆలోచనకే తావివ్వకుండా కళ్ళు గట్టిగా మూసుకుని కారుకు అడ్డంగా పడ్డాడు. అదృష్టవశాత్తూ డ్రైవరు తెలివిగా బ్రేకు వేశాడు, కాని ఆ తగిలిన దెబ్బకు అతను పదిగజాల దూరాన పడ్డాడు. తల క్రిందులుగా పడటం వల్ల తెలివితప్పేటంత దెబ్బతగిలింది.

అప్పటికప్పుడే పదిమందీ గుమిగూడారు. కారులోంచి ఒక యువకుడూ ఒక యువతీ దిగి శేషు దగ్గరికి వొచ్చారు.

"ఆస్పత్రికి తీసుకు వెళ్ళండి—" అంటున్నాడు ఒకడు జనంలోంచి.

"కారు నెంబరు...?" అంటున్నాడు ఇంకోడు.

"కళ్ళు నెత్తిన పెట్టుకొని తోలుతే!"

"డ్రైవరు తప్పులేదు...పాపం జాగ్రత్తగా ఆపాడు కూడాను—నేను అంతా చూస్తూనే వున్నాను"—

"డాక్టర్?" అంది ఆమె.

"ఫర్వాలేదు" అన్నాడు డాక్టర్.

"ఇంటికి తీసుకువెళ్దాం—"

శేషును మెల్లిగాఎత్తి కారులో పడుకోపెట్టారు. పోలీసువాడు వచ్చేలోపలే కారు కదిలింది.

# 2

డ్రాక్టర్—జాగ్రత్తగా కట్లుకట్టాడు. అతనికి క్రమంగా తెలివి వస్తోంది. కళ్లు తెరిచిచూసి, మూలుగుతూ మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

"మరేమీ ప్రమాదంలేదు, ఉదయమే వస్తాను. నేను వెళ్ళి నర్సును పంపుతాను..."

"నర్సు అవసరంలేదు, నేను ఇక్కడే వుంటాను."

"ఈరాత్రల్లా నువ్వు యీ రోగితో అవస్థపడతావా?"

"ఫర్వాలేదు...ఒక్కరాత్రికేగా!"

డాక్టర్ దీర్ఘంగా ఆలోచించి అన్నాడు; "నీ యిష్టం... రోగికి కాస్సేపట్లోనే బాగా తెలివి వచ్చేస్తుంది. పళ్లూ, కాఫీ ఆహారం యివ్వు. ఆసీసాలోని మందును ఒకసారి తాగించు...ఇక నేను వెళ్ళనా?"

ఆమె తలవూపింది; డాక్టర్ టోపీ తీసుకొని వెళ్ళి పొయ్యాడు. సాలోచనగా ఆమె రోగి ముఖంవంకనే ఆత్రుతతో చూడసాగింది.

శేషుకు బాగా తెలివివచ్చింది. దెబ్బతగిలిన బాధ కూడా బాగా తెలుస్తోంది. తను చచ్చిపోతున్నాడు కాబోలు! కళ్ళు తెరిచి చూద్దామనిపించింది; కాని భయం వేసింది.

వెధవప్రాణి యింకా పోదేం? ఇంత బాధతో కాని చావురాదని తనకు తెలుస్తే అసలు యీ పనికే తను పూనుకునే వాడు కాదు. కాని అది తెలియటం ఒకసారీ, ప్రాణం పోవటం ఒకసారీ కాదు కనక యీ పొరపాటు జరిగింది. బతకటంకన్న చావటమే కష్టంకాబోలు!

చావు త్వరగావస్తే బాగుండు ననిపించే ఆబాధ! ఇదివరకు తను అనుభవించిన కష్టాలు—తనను యీ ఆత్మహత్యకు పురికొల్పిన కష్టాలు—వాటన్నిటికన్నా యీకొని తెచ్చుకున్న బాధ మరీ భరించలేనంతగా వుంది! ఇదే కడసారి కష్టమని గుర్తుకు వచ్చినా అతనికి తేలిక అనిపించటం లేదు.

తెలివిగా వున్నప్పుడు కళ్ళు మూసుకొని ఎక్కువ సేపు పడుకోవటం చాలా కష్టంగా తోచింది. ఒక్కసారి తను కళ్ళు తెరిచి చూస్తే? అసలు తను ఏ లోకంలో వున్నాడో? భరించరాని యీ గాఢాంధకారంలోంచి ముందు బైట పడాలి! కళ్ళు తెరిచాడు: ఎదురుగుండా గడియారం రెండు గంటలు దాటిందని చాటుతోంది. విలువైన గాజు సామగ్రితో అందంగా అలంకరించబడ్డ విశాలమైన శుభ్రమైన గది కనిపించింది. దేదీప్యమానంగా వెలిగే ఎలక్ట్రిక్ దీపాలూ, పైన రివ్వురివ్వున తిరుగుతూ తనకు కావాల్సిన దానికన్నా ఎక్కువ గాలియిచ్చే పంకా, తన శరీరం కింద నలిగే మెత్తటి పరుపులూ—తను అసలు ఎవరో, ఏమిటో

కూడా క్షణం మరిచిపోయ్యేట్టు చెయ్యగలిగినయ్...ఇది స్వర్గమేమో? ఐతే యీ నరకబాధ యేమిటీ?

కళ్ళుమూసి సన్నగా మూలగసాగాడు. గాజులశబ్దంతో కూడిన ఒక కోమల హస్తం అతని ఫాలభాగాన్ని నిమిరింది. ఆ తాకిడి తనతల్లి ఆదరణ నంతా జ్ఞాపకం చేసింది. ఎవరు తననిలా ఆదరిస్తారు?

మళ్ళీ కళ్ళు తెరిచాడు. తన మంచం పక్కనే కూర్చున్న ఒక అందాలరాణి—తనవైపు అతృతగా చూస్తోంది. ఆమె దేవకన్యేమోనని ఆలోచించేందుకు మళ్ళీ ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నాడు.

"బాధగావుందా?" అంది ఆ కోమల కంఠం.

"ఊఁ" అని మూలిగాడు.

ఆమె తన ఫాలభాగంమీది చేతిని మెల్లిగా లాక్కుంది. ఆ చేతిని తన ఫాలభాగంమీదనే వుంచమని అడుగుదామని పించింది. కాని సిగ్గుపడ్డాడు.

"కాఫీ ఇమ్మంటారా?" అందామె.

అతని ఆకలి చప్పున జ్ఞాపకం వచ్చింది. తను ఇంకా యీ లోకంలోనే వున్నాననే దృఢవిశ్వాసంకూడా కలిగింది. కిందటి మధ్యాహ్నంనుంచీ తనపొట్ట ఖాళీగానే వుంది. ఆ బాధంతా ఇప్పుడుకాని తెలియటంలేదు.

"ఊఁ" అని మూలిగాడు మళ్ళీ.

ఆమె లేచి ఒకసారి విచారకరంగా అతని ముఖంలోకి చూసి వెళ్ళింది: ఆమె అక్కణ్ణుంచి కదులుతుందనుకుంటే అతను ఆకలిబాధనే మెన్నుకునేవాడు!

—మళ్ళీ అతని కష్టాలన్నీ జ్ఞాపకం రాసాగినయ్; తను అందగత్తెల్ని చూడకపోలేదు. లోకంలో తనకు అందని ఎంతసౌఖ్యం ఇతరుల పాలవటం లేదు? ఇదంతా తను ప్రతిరోజూ చూస్తూన్న విషయమే కనుక—క్షణక్షణమూ తను మాత్రం అలాటి సౌఖ్యానికి నోచుకోలేదనే అభిప్రాయం కలిగేందుకు సగం కారణమైంది.

అసలు తను కిందటి సాయింత్రం ఏ అభిప్రాయంతో బయలుదేరాడో అది సఫలంకాలేదు; తను యీపాటికి యీలోకంనుంచి మాయమవాల్సింది!

ఆ తరువాత ఏమైతేనేం?...కాని అలా జరిగినట్టయితే ఎంతబాగుండేది! తన జీవితంలో ఇంకా ఎన్నో జరిగి వుండాల్సింది. ఒక్కటి...లెక్కకుఒక్కటికూడా జరగలేదు. జరుగుతుందనే ఆశాలేదు. ఎంత నిర్భాగ్యత! ఎన్నిసార్లు తను నిరాశను ఎదుర్కొన్నాడు! తన హృదయంపొందే యీక్షోభను ఎంతకాలం దాచుకుంటూ బతికి మాత్రం తను వెలిగించేది ఏముంది! తను పట్టుదలగా యీ చివరి ప్రయత్నమైనా సాధించలేకపోతే—మళ్ళీ తన జీవితం ముళ్ళకంపల్లోకి పోతుంది...

తను బతికేందుకు ఏవిధమైన ప్రయత్నమూ చెయ్యకూడదు. ఈ మొండి ప్రాణికి, అంతకన్నా మొండితనాన్ని ప్రదర్శిస్తేనేకాని తను గెలవలేడు! ఇహలోకబాధల నుంచి తన విముక్తిని నిజంగా కోరినట్టయితే—ఇదివొక్కటే తనకు అగ్నిపరీక్ష!

ఈ సమయంలో తనకు ఎవరితో మాత్రం ఏంసంబంధం? ఆమె అందగత్తైఐతే తనకేం? ఈ మానవులు తన మృత్యుశయ్యమీదచూపే దయను తను అంగీకరిస్తే—ఇకముందు తనకు యీ లోకంలోమాత్రం మరి గతులు లేవు! ఈ లోకంలో తన కోసం ఏడ్చేవాళ్ళు, కనీసం తన కళ్ళ ఎదుట విచారాన్ని నటించే వాళ్ళు ఒక్కళ్ళు—ఒక్కరు కూడాలేరు! ఈ సంగతి తనకు బాగా తెలిసివున్నాక వీళ్ళ దయతో తనకేంపనీ?

ఆమె కాఫీ తెచ్చి అందివ్వబోయింది.

అతను 'ఒద్దు' అన్నట్టు సౌజ్ఞ చేశాడు.

"ఇప్పుడు తెస్తున్నారుగా?"

"అక్కర్లేదు" అన్నాడు మూలుగుతూ.

తనుపడే బాధను ఇతర్లు—యీనాగరికతా ప్రపంచం చూసి నవ్వి పోతుందేమోనని ఇన్నాళ్లూ భరించినట్టుగానే భరిస్తున్నాడు. కాని ఇప్పుడు మాత్రం అది అంత తేలిగ్గా లేదు. సానుభూతి చూపేవాళ్ళ ఎదుట ఏబాధ దాగ గలుగు

తుందీ? బాధను ఓర్చేందుకూ—డా ఒక పరిమితివుంది... అప్రయత్నంగా అతని కళ్ళు నీళ్ళతో నిండినయ్.

ఆమె మృదువుగా అడిగింది: "బాధగావుందా?" అతను సమాధానం చెప్పలేదు. తన మీద తనకు కలిగే సాను భూతిని దీనంగా ప్రదర్శించు కుంటున్నాడు.

"చాలా అలసిపొయ్యారు. కాస్త కాఫీతాగండి" అందామె. బతిమాలుతూన్నట్టు.

"నాకేమీ వొద్దు...నన్ను ఏడ్వనీయండి ... మీరు వెళ్ళిపోండి"

ఆమెను ఇప్పుడొక కొత్తభయం ఆవరించింది: తగిలిన దెబ్బవల్ల రోగికి మతిచెడిందేమో?

ఆమె అలాగే కాస్సేపు ఆశతో నిలబడి—మరేమీ ప్రత్యుత్తరం రాక పోవటంవల్ల - యీ సమయంలో రోగిని ఎక్కువగా మాట్లాడించి శ్రమపెట్టకూడదనుకొని — కప్పుల్ని ఆ పక్కనే టేబిల్ మీదపెట్టి వెనక్కు తిరిగింది...

కాఫీ తన కళ్ళఎదుటవుంటే అది తాగాలనిపిస్తుంది. తను బతికేందుకు ప్రయత్నం చెయ్యాల్సి వొస్తుంది. కనీసం తన చావును వాయిదా వెయ్యాల్సి వొస్తుంది. ఎంతత్వరగా వీలైతే అంతత్వరగా చద్దామని నిశ్చయించుకున్న తనకు ఇవన్నీ ఆటంకాలు...వెంటనే శేషు చెయ్యిజాపి కాఫీని కిందికి దొర్లించాడు.

కప్పుల చప్పుడుకు ఆమె వెనక్కు తిరిగి, నిశ్చేష్టురాలైంది. అతడు తెలిసివుండే యీ పని చేస్తున్నాడనేది స్పష్టమౌతోంది. అతనికి కోపమా? తనమీదనా? కాఫీ మీదనా? యీ విషయాన్ని తేల్చుకునేందుకు ఆమెకు ఇప్పుడు అవకాశంలేదు. అతను మాత్రం తను చేసిన ఘనకార్యానికి గర్విస్తూన్నట్టు సూచిస్తూ, మాటాడకుండా వూరుకున్నాడు.

ఆమె మళ్ళీ దగ్గరకువచ్చి నిలబడి, "బాధగావుంటే— మందు తాగమని డాక్టర్ చెప్పి వెళ్ళాడు. మందు ఇమ్మంటారా?" అంది!

అతను ముఖం చిట్లించి ఆమెను పరీక్షగా చూడసాగాడు. ఆమె ఒకప్పుడు తనకు క్లాసుమేటు. ఆమెను గూర్చి తనకు అంతవరకే తెలుసు. ఆ పరిచయాన్ని మాత్రం తను జ్ఞాపకం చేసుకొని బాధపడటం దేనికి? ఏ విధమైన ఆశనూ తను కల్పించుకోకూడదు—అంతే!

తనవైపు అంత దీక్షగా చూడటాన్ని ఆమె గ్రహించి అంది: "మీరు నన్ను గుర్తుపట్టగలిగారా?"

అతను ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేదు; బాధగా కళ్ళు మూశాడు.

"మందు తాగుతారా!" అందామె.

జవాబు రాకపోయినా ఆమె గ్లాసులో మందుపోసి మెల్లిగా అతని తలకింద చెయ్యివేసి—అతన్ని కూర్చోపెట్టేందుకు ప్రయత్నించింది. ముందున్న మందుగ్లాసు వైపు అతను

అప్రయత్నంగా వొంగి బొయ్యాడు ... కాని నీళ్ళం దయూ కలిసి తనను చావనీరా? తన ప్రాణంమీద తనకు అధి కారం, చచ్చేస్వాతంత్ర్యం లేదా? ఎంత దౌర్భాగ్యం!

అతనికోపం మిన్ను ముట్టింది. పళ్ళు పటపటాకొరికి— ఆ మందు గ్లాసును లాక్కొని, విసిరి నేలకేసి బాదాడు. ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయినయ్. అతడు మాట్లా డక పోవటం—ఆమెను భయపెట్టింది. అతని చేష్టల్ని ఏవిధంగా అర్థంచేసుకోవాలో ఆమెకు తెలియలేదు.

"ఏమండీ?" అంది.

అతను మాట్లాడలేదు;—ఇంక దాచుకొనే చోటులేక వెలువరించే దుఃఖాన్ని—కుమిలి కుమిలి ఏడుస్తూ ప్రదర్శించ సాగాడు.

తను ఎలా మాట్లాడితే అతనికి బాగుంటుందో ఆమెకు అర్థమవలేదు. ఇంత తమాషా మనస్తత్వాన్ని ఆమె ఎన్న డూ వినికూడా ఎరగదు. ఏమీ తోచక కాస్సేపు నిలబడి —ఆగదిలోనే ఇంకోమూల కుర్చీలో కూర్చొని చదువుకో సాగింది. చదువేమీ సాగలేదు. రోగి మూలుగులు ఆమె మనశ్శాంతిని భంగపరుస్తున్నయ్.

ఇప్పటికి నాలుగు చాటింది. రోగి మూలగటంమానే శాడు. అలిసి గాఢనిద్రకు ఉపక్రమించాడు. ఆమెనిట్టూ ర్చింది. పుస్తకాన్ని ఒళ్ళోనే పెట్టుకొని—క్రమంగా కూర్చొనే నిద్రపోయింది.

# 3

సూర్యోదయం కాకముందే కలత [illegible] ఆమె మేల్కొంది. రాత్రి జరిగిన సంఘటనలు ఆమెకు జ్ఞాపకం రాసాగినయ్. అతన్ని ఎలా జాలిదలచాలో ఆమెకు అంతు పట్టడంలేదు. రోగి నిద్రచూసి నిట్టూర్చింది.

అరగంట గడిచాక డాక్టర్ వొచ్చాడు. ఆమె డాక్టర్‌ను అవతలికి పిలిచి పరిస్థితి అంతా చెప్పింది; డాక్టర్ నవ్వాడు.

"అందుకనే నర్స్‌ను పంపుతానని చెప్పాను. రోగుల్తో అవస్థపడటం — వంట చెయ్యటమంత తేలిక గాదు..."

"అతను మందన్నా తాగలేదు..."

నేను తాగేట్టు చేస్తాను. ఇదంతా ఒక కళాభ్యాసం—"

వారిద్దరూ మళ్లీ గదిలోకి వొచ్చేప్పటికి రోగికి నిద్రమెలకువ వొచ్చింది. అతను మూలుగుతున్నాడు. మధ్య మధ్య ఎక్కిళ్ళుకూడా వొస్తున్నవి.

డాక్టర్ మెల్లిగా రోగిని తనవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించాడు. కాని రోగి తన [illegible] ంచి ఓడిపోయి కోపంకొద్దీ అరిచాడు; "[illegible]

రంజరూ నన్ను చావనీరా? వెళ్ళండి...వెళ్ళండి నాకేం వొద్దు!''

డాక్టర్‌ను విదిలించాడు. డాక్టర్ క్షణం ఆలోచించి అన్నాడు; ''మీరు వృథాగా నిరాశపడనక్కర్లేదు. మీరు కొద్దిరోజుల్లోనే పూర్తిగా ఆరోగ్యాన్ని సంపాయించగలుగుతారు. మీరు అంతగా గాభరాపడితే—''

''బకీ! నేను బతకాలని ఆశించడంలేదు. మీరు బాగా అర్థంచేసుకోండి. మీరు నాకేమన్నా సహాయం చెయ్యదల్చుకుంటే—నేను త్వరగా ప్రాణాలు విడిచేందుకు మందివ్వండి-తెలిసిందా!''

ఆమెతోపాటు డాక్టర్‌కూడా ఆశ్చర్యంతో మూగవోయ్యాడు. ఎంత నిరాశపడే వాడికైనా ఆశ వుంటుంది. ఆశలన్నీ వొదిలి కిందపెట్టాకకూడా వైద్యసహాయాన్ని ఆశిస్తారు. జీవితంలో ఎంత ఓటమిని ఎదుర్కొన్నా యింకా బతికి సాధిస్తామనే ఆశ ఎవరికివుండదు? అదీకాక, ఒకవేళ ఆత్మహత్యకు ప్రయత్నించినా—అదివొక క్షణిక బలహీనత్వమే కనుక-ఆక్షణం గడిచాక మళ్ళీ హృదయమంతా ఆశతోనిండి, తను ఎంత బుద్ధిహీనుడుగా ప్రవర్తించాడోననిపించక మానదు! కాని ఇతని విషయంలో—అది ఎంత వికృతమైన మానసిక పరిణామంలో పడ్డదో డాక్టర్‌కు అర్థమవ లేదు.

డాక్టర్ బతిమాలుతూ అన్నాడు: "మీరు చాలా కష్టాల్ని అనుభవించినట్టున్నారు. జీవితం మీదనే మీకు నిరాశ కలగటం అన్యాయం! ముందు జీవితం సంగతి జాగ్రత్తగా ఆలోచించేందుకు మేమందరమూ వున్నాం...... డాక్టర్లు ప్రాణదాతలని మీకు తెలుసు. మిమ్మల్ని చపేందుకు:....."

మధ్యలోనే అందుకొని శేషు "చావు అంత తేలికది కాదని నాకు బాగా అర్థమైంది. అందుకనే మందిమ్మంటున్నాను—" అని ఏడ్వసాగాడు.

డాక్టరుకు ఏమీ తోచలేదు. మునిపంటితో కింది పెదవి కరిచి—ఆమెను అవతలికి రమ్మని సౌజ్ఞ చేశాడు.

ఆమె ఆతృతతో డాక్టర్ ముఖంలోకి చూసింది.

"లాభంలేదు శ్రీ! అది మతిభ్రమణంకూడా కాదు. అతను తెలిసే బాగా మాట్లాడుతున్నాడు. పరిస్థితి ప్రమాదకరమైంది కాదు...కాని అతను మొండిగా ప్రవర్తిస్తే మాత్రం అమృతంకూడా ప్రాణం పొయ్యలేదు. ఇది శారీరకంగా కుదిర్చేందుకు ముందు, మానసికంగా కుదర్చాలి... అదంతా చాలా యాతన. పోనీ ఆ నిర్భాగ్యుడు ఎలాపోతే మనకెందుకు? మెల్లిగా జనరల్ హాస్పిటల్‌లో జేర్చి చేతులు కడుక్కుంటే సరిపోతుంది"

శ్రీదేవికి దుఃఖం ఆగలేదు. ఆమె కనుకొలకుల్లో రెండు కన్నీటి బిందువులు కిందపడేందుకు సిద్ధంగా ఉన్నయ్.

"అదేమిటి శ్రీ ? నీక్కూడా రోగికిలాగే పిచ్చి ఎక్కు తోందా ?" అన్నాడు డాక్టర్.

ఆమె ఎండుకుపోతూన్న గొంతుతో అంది : "మీరు దీనికి ఏదైనా ఉపాయం ఆలోచించండి. ఆతను నిర్భాగ్యుడే కావొచ్చు. అసలు అందుకనే అతనిమీద నాకు ఇంతదయ కలుగుతోందేమో ? అతన్ని నేను ఎరుగుదును. నాకు క్లాసు మేటు, బీదవాడు. చాల తెలివిగలవాడు. వారాలు చేసు కొని తింటూ కష్టపడి చదువుకున్నాడు. అతను సగం జీతం మీద చదివేవాడు. ఆసగంజీతం కట్టేందుకుకూడా అతనికి శక్తి చాలేదికాదు. ఒకసారి జీతం కట్టక పోవటం వల్ల అతని పేరు కొట్టేశారు. అప్పుడు ఎవరికీ తెలియకుండా ఆజీతాన్ని నేనుకట్టాను...నిన్న అతను మన కారుకిందనే పడ్డాడు. అతను చావటంలో పెద్దవిశేషమేమీ లేకపోవచ్చు. అది ప్రకృతి సిద్ధంగా వొచ్చినా ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. కానీ అతను నాయింట్లో నాకళ్ళముందు. నిష్కారణంగా చావటం నాకుఇష్టంలేదు, ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. అతనుబతికే వుపాయం చూడండి—"

డాక్టర్ శ్రీదేవిని ప్రేమిస్తున్నాడు. ఎలాగైనా ఆమెను పెళ్ళిచేసుకోవాలనే ప్రయత్నంలో ఇప్పటికి ఒక సంవత్సరం నుంచీ ఆమెను ఆరాధిస్తున్నాడు. తగినంతగా ఆమె అంగీకా రాన్ని సూచించక పోయినా అతను నిరాశపడలేదు. ఎలా గైనా ఆమెను ప్రతి విషయంలోనూ సంతోషపెట్టి క్రమంగా

ఆమె అనురాగాన్ని సంపాయించాలనే పట్టుదల అతనిలో అధికమౌతూ వొచ్చింది.

ఈ రోగివిషయంలో—అందరు రోగుల్లాగే ఇతనూ ఒక డనటంవల్ల అతనికి ప్రత్యేకమైన దయ ఏమీ లేదు. ఇప్పుడు శ్రీదేవిని సంతోషపెట్టేందుకుగాను అతను ప్రత్యేకమైన శ్రద్ధతీసుకోవాల్సి వొచ్చింది. ఇది డబ్బుకు నయంచేసే రోగమైతే అతను వొదిలిపెట్టేవాడే! ఆమెకు నచ్చజెప్పి రోగిని వొదిలించుకుంటామని అతనుచేసిన ప్రయత్నాన్ని—ఆమె చూపే శ్రద్ధా, పట్టుదలా—పాడుచేసినయ్.

రెండు చేతులమధ్యా తలయిరికించి ఒక పావుగంటసేపు డాక్టర్ బాగా ఆలోచించాడు. డాక్టర్ మంచి తెలివిగలవాడనేందుకు ఏమాత్రమూ సందేహంలేదు.

మెల్లిగా అన్నాడు : "సరే—నువ్వు అంతగా కోరుతున్నావ్ కనక చెప్తాను : నాకెక్కడా మానవులంటే దయలేక పోలేదు. బీదవాడు, మంచివాడు, చదువుకున్నవాడూ–అన్నిటికన్నా నీకుఇష్టుడు—కనుక అతన్ని బతికించేందుకే ప్రయత్నిద్దాం. కానిఒక్కటే ఉపాయంవుంది. అదిచాలా కష్టంతో కూడుచున్నది—"

"ఐతే ఐంది...త్వరగా చెప్పండి"

"అతడు జీవితంలో చాలా నిరాశపడ్డాడు; చూడబోతే నిజంగా అతనికి జీవించాలనే ఉద్దేశంకూడా లేనట్టుతోస్తుంది.

అతనికి 'నా' అనేవాళ్ళుకూడా ఎవ్వరూఉన్నట్టు లేరు. ముందు అతని మనస్సును వేరొక మార్గంలోకి లాగాలి—"

"దానికే—"

"వినుమరి : అతనికి ఒక ఆప్తబంధువు ఇప్పుడు చాలా అవసరం. అతనికి 'తన' మీద ఆశలేదు. అందుకని ఇంకోరి కోసం అతను బతికేందుకు ప్రయత్నించేట్టు చెయ్యాలి. చేతుల్లో స్వర్గంచూపి అతని ఆశల్ని రేకెత్తించాలి. అప్పుడు కాని అతను వైద్యానికిబాగా లొంగడు...మరి దీనికి నువ్వు ప్రయత్నిస్తావా ?"

"అంటే ఏంచెయ్యాలీ ?" అంది ఆమె తన అమాయకత్వమంతా బైటపడేట్టు.

తె"లియలేదా?...చూడు: ఆతన్ని ప్రేమిస్తూ వున్నట్టు నటించు. లాలనగా మాట్లాడు. అతని హృదయంలోని జ్యోతిని మళ్ళీ వెలిగించు. నీ ఆత్మబంధువు మృత్యుశయ్యమీద వుంటే నువ్వెంత బాధపడతావో— అంత బాధా పడు!... ఇది పురుషులకు సాధ్యంకాదు. అంత ఓర్పు వాళ్ళ దగ్గర ఉండదు. అతను ఎన్ని అన్నా, తిట్టినాసరే—విసుక్కోకుండా అతి ప్రసన్నతగా ఉండు. నీ లోకమందు, నీ జీవితపు టాశలన్నీ అతనిమీదనే ఆధారపడి ఉన్నట్టుగా నటించు... ఇదంతా ఒట్టి నటన! ఇందువల్ల నీ కేమీ నష్టంలేదు. క్రమంగా అతను లొంగిపోక తప్పదు. ఉన్నవీ, లేనివీ అతనికి ఆశలుపెట్టు. స్త్రీ వేసే అస్త్రాలకు లొంగని పురుష

హృదయం ఉండదు. అందులోనూ నీలాటి అందగత్తెముందు అతి తేలిగ్గా లొంగిపోతాడు. నీముఖం అతనికి అపరిచితమైంది కూడా కాదు కనుక—ఇది తేలిగ్గానే జరిగిపోతుంది. అదీ కాక రేకెత్తించేందుకు అవకాశం ఉంటుంది – అర్థమైందా?''

ఆ మాటలన్నీ ఆమెకు వెంటనే అర్థంకాలేదు. కొంత మింగుడుపడ్డాక ఆశ్చర్యంతో అంది: ''నటనా?''

''ఔను...నటన! ... నువ్వు ఇదివరకు కాలేజీ నాటకాల్లో వేషాలువేసి చూపానంటివే—అదీ!''

''కాని అది రంగస్థలంమీద. మనం ఎవరమో, ఏ పాత్రను ప్రదర్శిస్తున్నామో తెలుసుకుంటూ చూపేది. కాని ఇది నిజమైన జీవితంలో—''

''దానికీ దీనికీ తేడా ఏముందీ? నేను చెప్పేదికూడా అదే ! నువ్వెవరో, నీ ఆశయం ఏమిటో, నువ్విలా ఎందుకు ప్రవర్తిస్తున్నావో అంతా ప్రతిక్షణమూ తెలిసే ఉంటుంది... దీన్నే నేను 'నటన' అంటున్నాను.''

''జీవితంలో నటనసాధ్యమా?''

''ఎందుకు కాదు? మనం నటించి ఎన్నింటిని సాధించటం లేదు? మన మనస్సులో జరిగే పరిణామాలకూ, మనం పైకి కనపర్చే ప్రవర్తనకూ తేడావుంటోందా లేదా? ఇష్టం కాని వ్యక్తితో మాట్లాడేటప్పుడు — లోపల ఆ వ్యక్తిని తిట్టుకుంటూ—పైకి అదేమీ కనసరచకుండా చెయ్యటం లేదా? అది నటనకాక మరేమౌతుంది? ఇది ప్రతి జీవితంలోనూ,

ప్రతిక్షణమూ జరుగుతూనే వుంది. ఇదే లేకపోతే యీ జీవితం ఎంత దుర్భరమో ఆలోచించు, జీవితమంతా నటనే అనేందుకూడా అనుమానం అక్కర్లేదు—"

'జీవితమంతా నటన!' అన్నమాట విన్నప్పుడు ఆమె ఆశ్చర్యపడ్డది, ఏదో కొత్తసిద్ధాంతం—తను కలలోనైనా తలవనిది—విన్నట్టు పులికిపడ్డది... కాని డాక్టర్ చెప్పిన మాటల్ని మెల్లిగా అర్థంచేసుకుంది. ఆ మాటల్లో ఎంత నిగూఢసత్యం వుంది! జీవితం ఎంత 'నటన'తో కూడుకుంది! కాని ఇదంతా 'నటన' అని ఆలోచించేందుకూడా తను అవకాశం యివ్వకుండా సాగిపోతోంది ... ఒకవేళ తను అలాటి ఆలోచననే అవకాశం ఇస్తే అసలు ఆ నటన సాధ్య పడదేమో! చూస్తూ చూస్తూ దొంగవేషం వెయ్యటంలో ఉన్నకష్టం దొంగవేషం అనే ఆలోచన లేకుండా చప్పున వేసి కూర్చోవటంలో ఎందుకుంటుందీ? ఆ 'దొంగవేషం' అవసరం తీరాక దాన్నిగూర్చి ఆలోచించేందుకు అది అమిత స్వల్పవిషయం అవుతుంది; తప్పు చేస్తూన్నా అది 'తప్పు' అనే జ్ఞానంఉంటే యీకల్మషాత్మపడే బాధ ఇంతా అంతా కాదు! కాని కుర్రాళ్ళకు ఆ జ్ఞానం లేకపోవటంవల్ల— పెద్దవాళ్ళు చెయ్యలేని తప్పుల్నికూడా ఇట్టే చేసిపారేస్తారు: ఈ విధంగా జీవితంలోని 'నటన'కు ఏగతి పట్టిందంటే— అది గాలిపీల్చినంత తేలికా, అవసరమూ ఐకూర్చోవటంవల్ల దాన్నిగూర్చి లోతుగా తను ఎప్పుడూ ఆలోచించలేదు.

"ఇప్పుడు ఉపాయమంతా అర్థమైందా?" అన్నాడు డాక్టరు.

"అర్థమయింది... కాని..."

"ఇందులో 'కాని'కి అవకాశం లేదు"

"చూస్తూ చూస్తూ నటించటం—"

"ఔనుమరి...అవ్వాకావాలి! బువ్వాకావాలి అంటే కుదరదు. ఇదంతా నీ ఒక్కతెవల్లనే జరగాలి. అందుకని నర్సు అవసరంకూడా లేదు. నటించటం కష్టమో, సుఖమో నాకు తెలియదు. అదంతా నీకు సంబంధించిన విషయం. నాటకంలోలాగు చేసి ఊరుకో, అంటే నువ్వు చేసేదాంట్లో 'సిన్సిరిటీ' ఉండాలి—" అని పొరపాటు మాట్లాడినందుకు నాలిక కొరుక్కొని అన్నాడు; "అంటే ఉన్నదని అతనికి గాఢవిశ్వాసం కలగాలి. వివిధ అభిరుచులతో కూడిన ప్రేక్షకులు లేరు. ఒక్కడే ప్రేక్షకుడు. అతనే పాత్రకూడాను! నువ్వు అంతవరకూ చెయ్యగలుగుతే-ఆపైది నేనేచేస్తాను... నాకు చాలా ఆలస్యమైంది, నేను వెళ్తున్నాను మళ్ళీసాయింత్రం వొస్తాను. అంతా నటన...నటన!" అంటూ డాక్టర్ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ జారుకున్నాడు.

ఆమెకు చాలా అనుమానాలు కలిగినయ్. కానివాటిల్లో ఒక్కటికూడా డాక్టర్ వల్ల తీరేవి కాదని చెప్పిన జ్ఞాపకం వొచ్చి డాక్టర్‌ను వెనక్కు పిలవలేదు. ఒకచోట కూర్చొని ఆమె ఆలోచనా సముద్రంలో నిమగ్న మయింది.

# 4

ఇప్పుడు తనకు కర్తవ్యం ఏమిటి?

ఇది తను జీవితంలో తెలిసినటించాల్సిన సమయం. ఇదివరకు తనకు రంగస్థలంమీద నటనానుభవం కొద్దిగా వున్నమాటైతే నిజమే కాని—అది డైరెక్టరు కొంత చెప్పడంవల్లా, తనుకొంత ఆలోచించటంవల్లా నేర్చుకోగలిగింది...గాని ఇప్పుడు స్వతహాగా అంతా తనే చూడాలంటే ఎంతకష్టం! రంగస్థలంమీద తనకు కలగని ఒక కొత్త భయం ఇప్పుడు ఆమెని ఆవరించింది.

అందులోనూ ఇది ప్రేమఘట్టం! తను ప్రేమనుగూర్చి విన్నది! ప్రణయాగ్నినిగూర్చి చదివింది; కానిఅది సరిగ్గా ఎలావుంటుందో తను ఎన్నడూ అనుభవించలేదు. తన అందాన్నిచూసి తన వెంటబడ్డ యువకులు—ఆప్రేమనుగూర్చి అనేక పిచ్చిమాటలు మాట్లాడారు. కాని ఇంతమందికీ తను ఒక్కతే గురికావటంచూచి ఆమె భయపడ్డది; ఇందులో ఏదో 'కీలకం' వుందని గ్రహించింది. అందుకని ఇందంతా ఒట్టి బూటకమనే సిద్ధాంతమునీద ఆమె ప్రవర్తించటం మొదలు పెట్టేటప్పటికి...ఆ యువకులు ఒక్కొక్కళ్ళే జారుకోవటం మొదలు పెట్టారు. ఒక్కరి ప్రేమనుకూడా అంగీకరించే సదవకాశం తనకులభించలేదు.

ఇప్పుడు డాక్టర్ కూడా తనను ప్రేమించి—స్నేహమనే వంకమీద తన యింటికి రాకపోకలు సాగించాడు. ప్రేమించేందుక్కూడా ఒక తెర అవసరంగాబోలు! ఏమైనా ఇది లోక మర్యాదకిందా, సాంఘిక ఆచారంకిందా చలామణీ ఐపోతోంది. అటువంటిది— ఇప్పుడు ఏ తెరాఅడ్డులేకుండా ఆ ప్రణయఘట్టాల్ని నటించటంయెట్లా? పోనీ తనుయీడాక్టర్ ప్రేమనైనా అంగీకరించివుంటే—దాని పరిణామాలన్నీ తనకు బాగా అర్థమైవుండేవి. అందుకు ఒక్కటే కారణం నిజంగా తనను ఆరాధించగల వ్యక్తిని తను వివాహం చేసుకోవాలని ఏనాడో నిశ్చయించుకుంది; కాని తనను యింత వరకూ ఆరాధిస్తూ వొస్తూన్న యువకులంతా ముఖ్యంగా తన భాగ్యాన్నిచూసి! ఎదుటివ్యక్తి ఒట్టి మూఢుడనే సిద్ధాంతంమీద బయలుదేరటం మొదలుపెడితే—ఆ పరీక్షకు నిలబడగలిగేవాళ్ళు బహుకొద్ది — అసలు దొరకరేమో కూడాను! ఆమె ప్రతివ్యక్తి విషయంలోనూ యీ సిద్ధాంతాన్ని ప్రయోగించి చూడటంవల్ల ఆమె ఇంతవరకూ తగినవాణ్ణి ఎన్నుకోలేక పోయింది. ఒక్కొకళ్ళే జారుకోవటం మొదలు పెట్టినప్పటినుంచీ—యీ వ్యవహారంలో ఆమె మరింత జాగర్తగా ప్రవర్తించ సాగింది. తన కోసమని వొచ్చినవాళ్ళు చాలాభాగం ఆ ప్రణయాన్ని నటిస్తారని ఆమెకు బాగా అర్థమైంది; లోకంపోకడ బాగా తెలిసిపోయింది. తనకు యీ ఘట్టం దాదాపు బొత్తిగా కొత్త

వ్యవహారం కావటంవల్ల ఎలా సమర్థించుకోవాలో ఆమెకు అంతా అగమ్యగోచరంగా తోచింది.

కాని ఇలాటి సంఘటనే ఇదివరకు తనజీవితంలో సంభవించి వున్నట్టయితే-ఆ మొదటిసారికూడా తనకు క్రొత్తేగా! ఐతే అప్పుడు ముందడుగు వేసేది. పురుషుడు కనుక తనకంత కష్టంలేకుండా—అసలు అదొక నూతనానుభవమనే అభిప్రాయమే కలగకుండా అతిసాఫీగా సాగిపొయ్యేది. కాని ఇక్కడ అలాటి అవకాశమేమీ లేకపోను. ముందడుగులన్నీ తనే వెయ్యాల్సిన బాధ్యతవుంది. తనకు తెలియని విషయాన్ని, ఇంకో వ్యక్తికి (ఆ వ్యక్తికి తెలుసో. తెలియదో తనకు తెలియదు) నేర్పబోతోంది...ఆమెకు నరాలన్నీ లాగుతూన్నట్టనిపించింది!

నిజంగా తనకు అతను ఏవిధమైన ఆప్తుడూ కాడు. అలాటి వ్యక్తికోసం తను ఇంత శ్రమకూ, కష్టానికీ పాల్పడకుండా—ఊరుకుంటే? అతనిస్థితి జ్ఞాపకంరాగానే ఆమె సున్నితహృదయం మళ్ళీ ద్రవించ నారంభించింది. తను ఏ విధమైన దయనూ చూపకుండా ఉన్నట్టయితే-అతను ఆ కారుకిందపడ్డప్పుడే, ఒక మామూలు బీదవాణ్ని చూచినట్టు అతన్ని జనరల్ హాస్పటల్‌కు పంపి, కొంతడబ్బుయిచ్చి వొదిలించుకో వాల్సింది! కాని ఇంతదూరం వొచ్చాక —తన కళ్ళ ఎదుట, మానవులకు సాధ్యమైన చికిత్స— విశేషించి తన చేతుల్లోనేవున్న చికిత్స కరువై చనిపొయ్యే

ఒక వ్యక్తి—తనతో చదువుకున్నవాడు, ఒకనాటి తన దయకు పాత్రుడైనవాడు, సౌమ్యుడు, నిరాధారి, అందగాడు, తెలివిగలవాడు—యీనాడు యిలా పీడిపాయ్యే పరిస్థితిలో వుండటాన్ని తను యీ రక్తమాంసాల గుండెతో ఎలా భరించగలదు? ఇది దుర్భరమైన విషయం! నాగరికతా ప్రపంచంలోని తనలాంటి చదువుకున్న స్త్రీ విషయంలో క్షమించరాని నేరం! మానవుడికోసం కోటిమానవుడు రక్తం యిస్తూన్న యీ రోజుల్లో—ఒక జీవికోసం ఇంకో జీవినే త్యాగం చెయ్యగలుగుతూన్న రోజుల్లో—ఏవిధమైన ప్రతిఫలమూ కోరకుండానే, వున్న సౌఖ్యాలన్నింటినీ వొదిలి, దేశ స్వాతంత్ర్యంకోసం—కోటిమానవుల స్వేచ్ఛ కోసం జీవితాన్నంతట్నీ దేశసేవకు ధారవోసే మహానుభావులున్న రోజుల్లో—తను యీ అల్పసహాయాన్ని చెయ్యలేక పోవటం నిజంగా సిగ్గుపడాల్సిన విషయం!

అతను తనకు బంధువుడూ, ఆప్తుడూ కావాలనే 'షరా' ఎక్కడవుంది? ఒకవేళ తనకు ఒక పరాయి మొగవాడు... అదివరకు ముక్కూ మొగమూ యెరుగని వ్యక్తి, కలలోనైనా తను వూహించని రూపంగలవాడు—భర్తయితే—సంఘంచేత నియమించబడ్డ యీ నూతనాధికారిని తను జీవితంలోని మొట్టమొదటి రోజునుంచీ ఎరిగి వున్నట్టు అతను తనకు ఆప్తుడైనట్టు—అతనిముందు మోకరించి తన సర్వ

స్థానాన్ని అర్పించవద్దా?—కనీసం అలా నటించి తీరాలి కదా?

ఈ ప్రస్తుత పరిస్థితి అంతకన్నా తేలికదే! నిజమైన భర్త యెదుట తను చేసే, చెయ్యాల్సిన నటన అంతానిజం కిందనే చలామణి అవుతుంది! అది అసలు జీవితంలోని సాన రాయి కనుక అమిత బాధ్యతతో నిర్వహించాలి...కాని యిక్కడ చాలా స్వేచ్ఛవుంది; నిజమైన భార్యాత్వమూ కాదు...ఒట్టి స్నేహము, ప్రాణి ప్రాణిమీదచూపే దయ. జాలి, ఒకవిధమైన చికిత్స — హృదయానికి హాయినిచ్చే సంభాషణ. ఆత్మ ఆనందించే చేష్టలు—ఇంతా యేదుస్తే 'నటన?'

ఈ ఆలోచనతో ఆమెకు కొంత ధైర్యం వొచ్చింది... మెల్లిగా అతని రూపాన్ని బాగా జ్ఞాపకం చేసుకుంది, అతను అందగా డనేందుకు సందేహం లేదు. జాగర్తగా పరిశీలిస్తే అతను ఏ విషయంలోనూ తనకు తీసిపోడు. తనకు ఇష్టుల్లో ఒకడు. సమర్థుడైన వాడిముందు నటించాలంటే తను మహా జాగ్రర్తగా, అమిత మెలకువతో నటించాలి... ఇది తప్పదు!

అప్పుడు ఆమెకు ఒక క్రొత్త అనుమానం కలిగింది. అసలు తనకు తెలియకుండానే ఇదివరకు నుంచీ అతన్ని కొంతవరకూ ప్రేమిస్తోందా? ఇందుకు కారణాలు లేకపో లేదు...తను చదువుకునే రోజుల్లో ఒకసారి అతని జీతాన్ని

కట్టింది. అది వట్టి 'దయ' మాత్రమే కాదేమో? అతని కన్న బాధపడేవాళ్ళు లోకంలో వున్నారు. వీధిలో అన్నానికి మాడుతూ ఎంగిలి ఆకులకోసం తిరిగే వాళ్ళమీద తనకు కలగనిదయ అతని విషయంలో ఎందుకు కలిగింది? అతని లాటి విద్యార్థులమీద తనకు ఎందుకు దయకలగ లేదు? అతని తెలివితేటల్నీ, అతని అణకువనూ, అనేక సార్లు జ్ఞాపకం చేసుకునేది; పరీక్షలైపోయి లోకంలో తలకో దారిగా వెళ్ళేనాడు, అతనికి తన తండ్రి దగ్గరే ఉద్యోగం యిప్పించాలనుకుంది! అదంతా అనేక కారణాలవల్ల తటస్థ పడలేదు. తనపక్కన కూర్చునే విద్యార్థిని రూపు ఆమెకు జ్ఞాపకం లేదు కాని—ఇతను మాత్రం అప్పుడప్పుడు తనకు జ్ఞాపకంవొస్తూనే వున్నాడు...

తన విద్యార్థినీదశ అంతానిన్న కాక మొన్ననే గడిచిపోయి నట్టు బాగా జ్ఞాపకంవుంది. అతని విషయం తనకు అంతగా ఎందుకు జ్ఞాపకం వుండలి? ఇక యీనాడు అతను కారు కిందపడితే—తను అతనివిషయంలో ఇంత శ్రద్ధను ఎందుకు చూపాలి? అతనికి సేవచేస్తూ, అతని విషయంలో ఇంత అతృత పడటం దేనికి? ఒకజీవి బాధపడుతూంటే ఇంకోజీవి ఆబాధలోని గొంతభాగం ఎందుకు అనుభవించాలి?...ఒక ప్పుడు, మొన్నీ మధ్యనే డాక్టర్‌కు జ్వరంవొస్తే ఆ విషయం తనను అంతగా బాధించలేదు. ఏదో తన దూరపు బంధువుకు వొచ్చినట్టుగా తోచింది. కాని అదే తనతండ్రికివస్తే—

తను అహోరాత్రాలూ సేవచేసి వుండేది. అంటే ఇలాటి హృదయబంధనాలనేవి వివిధరూపాల్లో కనబడకుండానే వుంటున్నయ్యన్నమాట! ఎలాటి బంధనా తనకు లేకపోతే-దాదాపు గత రాత్రంతా మేల్కొని తను అతని సేవలో ఎందుకు నిమగ్నమైంది?...అతను ఏనాడో తన హృదయంలో ఒక ఆత్మబంధువు రూపాన అవతరించి వుండలేదు కద?

ఈ తలపుతో ఆమెకు అమితధైర్యం కలిగింది. ఒక ప్రాణిని రక్షించేందుకు కావాల్సిన శక్తిని—ఒకవేళ అది తనలో తక్కువైతే—తనకు ఆశక్తిని ప్రసాదించమని ఆమె తనవిధిని ప్రార్థించింది.

వెంటనే రంగస్థలాన ప్రవేశించటం తప్ప ఇంకేమీ లేదు. ప్రత్యేకమైన సంభాషణలేమీ యిక్కడ రాసిపెట్టిలేవు. సమయానుకూలంగా మాట్లాడుతూ కవిపాత్రనుకూడా తనే నిర్వహించాలి. ఇప్పటికే చాలా ఆలస్యమై పోయిందనే భావంతో ఆమె లేచి నిలబడ్డది. ఆమె హృదయం ఒక మహాత్కార్యం చెయ్యబొయ్యేప్పుడు కలిగే ఉత్సాహంతో నిండి పోయింది. తప్పకుండా గెలుపు తనపక్షమేననే దృఢ విశ్వాసంతో కదిలే మహాపిడుగులాగు—ఆమె శేషువున్న గది వైపు చకచకా నడవ నారంభించింది.

# 5

అతనిస్థితి చూసేటప్పటికి ఆమెకు ఏమీ తోచలేదు; అలాగే నిలబడిపోయింది. మూసివున్న అతని కళ్ళనుంచి నీరు కారుతోంది. అతను అనుభవించే బాధస్వరూపం ఆమె ఊహకు చిక్కటం లేదు. మరీ ఎదుటివ్యక్తి ఇంత విచారకరమైన స్థితిలో వుంటే — తనెలా ప్రవర్తించాలనే బాధ ఎక్కువైంది. తను ఏంచేసి అతన్ని సంతోషపెట్టేట్టు? గాఢంగా పాతుకుపోయి అతన్ని యీ నిరాశకులోలిన తలపుల్ని తను మళ్ళించాలి—ఎట్లా? కాని తను ధైర్యంచేసి అతని ఆత్మబంధువులాగు నటించాలనే కొండగుర్తుమాత్రమే ఆమెకు చుక్కానిగా వుంది.

మెల్లిగా చప్పుడుకాకుండా వెళ్ళి అతని మంచంమీద కూర్చొని, సున్నితంగా తన పమిటకొంగుతో అతని కంటి తడిని అద్దింది. అతను ఉలిక్కిపడి కళ్ళుతెరిచి చూడగలిగేప్పటికి—ఆమె కళ్ళలోకూడా నీళ్ళుతిరిగినయ్. ఆ నీరు ఆమె నటించి తెచ్చుకున్నవికావు; తను అంత గొప్పనటి కూడా కాదు. అసలు అలా కావాలంటే నీరు వూరేందుకు భూమాత స్వరూపం తనలోలేదు. ఒక జీవిమీద జాలి కరిగి ప్రవహించేరకం నీరది! తను అతన్నిగూర్చి యింతగా

ఎందుకు జాలిపడ్డది ? ఇంతగా ఎందుకు బాధ పడగలిగిందో ఆమెకే తెలియదు!

శేషు యీ దృశ్యాన్ని ఒక్కసారిగా నమ్మలేక పోయ్యాడు. అతనిస్థితి కొన్ని క్షణాలవరకూ అతనికే తెలియ లేదు. అలాగే అతను దీనంగా, జాలిగా, బాధగా శ్రీదేవి ముఖంలోకి చూడసాగాడు.

అతనలా తనవైపు చూస్తూన్నప్పుడు శ్రీదేవికి సిగ్గయింది. కాని ఆ సిగ్గును ప్రకటించేందుకు ఆమె సాహసించ లేదు; ఎందుకంటే—తన నటన అంతా ఇప్పుడే పాడై పోతే? అదీకాక—తనలాటి విద్యాధిక, తనకుపరిచయుడైన ఒక పురుషుడు తనవైపు చూచినంత మాత్రాన సిగ్గుపడి పోవటం—నిజంగా సిగ్గుపడాల్సిన విషయమే!

ఆమె మెల్లిగా తనకళ్ళను తుడుచుకుంది.

ఇదంతా నిజమేననే నిర్ధారణకు రాగానే—యీ అయాచితానురాగాన్ని చూపే యీ సుందరమూర్తిని చూసి, ఆశ్చర్య పడుతూ దుఃఖంతో తడి ఆరిన కంఠాన్ని సరిచేసు కుంటూ శేషు అన్నాడు: "శ్రీ!"

ఆమె "ఊఁ" అంది సన్నగా,

ఒక్కసారిగా అతనికి బతకాలనే ఆశకలిగింది, తనమీద దయచూప గలిగే ఒక్కహృదయం ఇంకా యీ లోకంలో వుందని ఇదివరకు తెలియక—తను ఇంత పిచ్చిపనికి పూనుకో గలిగాడు. ఇన్నాళ్లూ తను ఈ లోకాన్ని

యీ మెకోరకే గాలిస్తున్నాడు కాబోలు! అసలు జీవితమే ఆశామయం! ప్రతి మానవుణ్నీ—చివరిసారి భూలోక వాయువు పీల్చేటంతవరకూ వెంటపడే ఆశను తనెలా ఏమర పాటున మరిచి పోగలిగాడూ? ఒకవేళ ఏ వ్యక్తయినా జీవితాంతంవరకూ సౌఖ్యపడనట్టయితే—అతనికి ఇంకొక్క ఆశకూడా వుండితీరుతుంది; అది—తనుచచ్చి స్వర్గానపడి సౌఖ్యపడదామని! అదికూడా లేకుంటే చావటం ఎంతకష్టం! ఎంత అసంతృప్తి! శేషుకు ఇప్పుడే యీ సత్యం కళ్ళకు కట్టినట్టయింది.

కాని వెంటనే అతన్ని నిరాశ ఆవరించ మొదలిడింది. నిజానికి శ్రీదేవి ఎవరో? తనెవరో? ఆమెకు తనమీద దయ కలిగేందుకు ఏమంత చెప్పుకోదగ్గ కారణాలున్నయ్? తన కారుకింద పడబట్టి తనకు ప్రాణాలు పొయ్యాల్సిన బాధ్యత మాత్రమే ఆమెకు వున్నదని అభిప్రాయపడి వుండొచ్చు. ఇంకేమన్నా కారణాలుంటే అవ్వి తన వూహకు అతీతాలు! తను యీ స్థితిలో నమ్మగల కారణం ఒక్కటే-మానవుడు తోటి మానవుడికిచూపే జాలి! ప్రాణాన్ని నిలుపుదామనే ఆశయం వున్న మానవ హృదయంలోని రక్తమాంసాల సౌకుమార్యం! తనువున్న యీస్థితిలో అందరూ దయగానే వుంటారు; లేక అలా వున్నట్టు తను భ్రమిస్తాడు! ఆస్పత్రిలో నర్సులూ డాక్టర్లూ తమరోగులకు దయగావున్నట్టు! మందుల కన్న యీ 'దయే' రోగాన్నీ, బాధనూ ఎక్కువభాగం కుద

ర్చగలదేమో? తను యీ ప్రాణగండంనుంచి బైటపడ్డాక, ఎవ్వరికీ తనమీద యీ 'దయ' వుండదు. మళ్ళీ తన బి. ఏ. పట్టాతో గాలికీ, దుమ్ముకూ రోడ్లమీద తిరగాల్సిన మా మూలు శేషే! ఇలాంటి సందర్భంలో తను బతికి సాధించేదీ, సాధించగలిగేదీ ఇంకేముంటుందీ? మళ్ళీ బతకటం ఆ శ్రమ —ఆబాధలు, మళ్ళీ చద్దామనే ఆలోచనకు తనను లాగే ఆ కష్టాలూ—ఒద్దు—తనకుతనై ఆ అనుభవించిన వాటిని మెడలో వేసుకోవటంకన్న బుద్ధితక్కువపని యింకే ముంటుందీ?

"మందు తాగరా?"

తనను ఎంత మర్యాదగా, దీనంగా ప్రార్థనాస్వరంలో అడిగింది! ఇంతవరకూ తను అధికార్లకు వంగి వంగి సలాము లుచేస్తూ అణిగి మణిగి మాట్లాడేందుకు అలవాటుపడ్డాడు. కాని ఇంత మృదు మధురంగా తనను అడిగినవాళ్ళెవరూ? తన తల్లి పోయ్యాక ఇలాంటి అనుభవం ఇదే మొదలు!

మళ్ళీ అతనికి కొత్తరకం ఆలోచనలు బయలుదేరినయ్. నిజంగా ఆమె తనను ప్రేమిస్తోందేమో? ఆమె తనకు ఇంత వరకూ చేసినసేవా! తనమీద ఆమెకు కలిగే యీ క్షణ క్షణాభివృద్ధయ్యే సానుభూతీ, దయా—వీటన్నింటినీ ఒక్క సారిగా తీసిపారెయ్యటం ఎట్లా? తనంటే ఆమెకు ఇష్ట మేమో? అభిమానమేమో? తనకళ్ళనూ, తన అనుభ వాల్నీ నమ్మకుండా ఎట్లా వుండగలడు?

ఒకవేళ ఇదే నిజమైతే-ఆమె ఎంత మోసానికి గురవుతోందో తెలుసుకోవటం లేదల్లేవుంది! తనబోటి నిష్ప్రయోజకుడిమీద చూపే యీదయ అంతా ఎంత వ్యర్థమో ఆమె ఆలోచించటంలేదు తనకు ఇంతగా సానుభూతిచూపే ఏకైక ప్రాణిని యీ మోసానికి గురిచెయ్యటం—తన కృతఘ్నతను వెళ్ళగక్కటమే! అదీగాక అంతా మించి పొయ్యాక ఒకవేళ ఆమె తెలుసుకున్నా అది చేతులు కాలాక ఆకులు పట్టుకోవటమే అవుతుంది. తనస్థితిని ఆమెకు విశదీకరించటం—తనవిధి!

"శ్రీ" అన్నాడు, వికటంగా నవ్వి.

"ఆఁ"

"నీకు తెలియదు—"

"ఏమిటీ?"

"నా స్థితి—నాకష్టాలు, నా నిష్ప్రయోజకత్వం..."

ఆ విసురూ, పట్టుదలా తగ్గిందని ఆకంఠధ్వనే చెప్తోంది. తను అడ్డు ప్రశ్నలువేసి అతన్ని శ్రమపెట్టి బాధించకుండా-లాలించాల్సిన సమయమని ఆమెకు తోచింది. అందుకనే అతను చెప్పబోయేదాన్ని శ్రద్ధగా వినసాగింది.

"బతకటం ఎంతకష్టమో నీకు తెలియదు; భూలోకంలోని ఆశలన్నీ తీరగా, మృత్యు ముఖంలోని సౌఖ్యానికి మాత్రమే ఎదురు చూస్తున్నాను. మీరు నాకు చెయ్యగలిగిన వుపకారం యేమిటంటే — నన్ను ప్రశాంతంగా

చావనియ్యటమే! నాకు తెలుసు—చివరకు ప్రభుత్వంకూడా ఎవరి ప్రాణాలమీంది హక్కును వాళ్ళకే వొదిలి చేతులు దులుపుకొని కూర్చోలేదని. నీలాంటి దయామయులు దీనులకు సానుభూతి చూపవొచ్చు. కాని దాన్ని నాలాంటి నిర్భాగ్యుడి మీంద వ్యర్థం చెయ్యటంకన్న — బతికి బాగుపడదామని అండ దొరక్క అవస్థపడే వాళ్ళకు చూపటం మంచిది—''

''ఇంతగా నిరాశపడటం దేనికి?''

''నా కెవరున్నారు? జన్మించింది మొదలూ నాకు తెలిసిన ఒక్క బంధువు — మా అమ్మ. ఆమె కూడా చనిపోయింది. నాకు యింకా యీ లోకంలో మిగిలిం దేముందీ? ఉన్న వుద్యోగమా పోయె! ఆరోగ్యమా చెడె! ఇంకా దేనికి యీ అంధకార జీవితం? ఎవరికోసం—''

''నాకోసం...'' అందామె మధ్యలోనే.

''ఆఁ'' అన్నాడు. తన చెవుల్నే అనుమానిస్తూ.

''ఔను ... నా కోసమే! నాకు ఆ మాత్రం అర్హత లేదా?''

అతను తన బలహీనత్వాన్ని వెతుక్కోసాగాడు.

అన్నాడు: ''పిచ్చిపిల్లవు; నీ అమాయకత్వం చూస్తే నవ్వొవస్తోంది. ఒక సామాన్యుణ్ని, బీదవాణ్ని—నీకోసం బతికించుకుంటే...''

"కాని ఇష్టాయిష్టాలకూ, అభిమానానికీ, అనురాగానికీ డబ్బుకాదుగా ప్రధానం! లోకంలో డబ్బు పుట్టనినాడు, అది దొరకనిస్థలాల్లో, నిరుపయోగమయ్యే ప్రదేశాల్లో, దాని విలువ తెలియని వ్యక్తులమధ్య — ప్రేమ వుండ కూడదా?"

అతను ఆలోచిస్తున్నాడు. ఔను ... ఎందుకు వుండ కూడదూ ఆమె చెప్పిన మాటల్లో ఎంత సత్యం వుందో, ఏ విధమైన వాదనకూ ఆ మాటలు ఎంత అతీతాలో అతనికి బాగా అర్థమయింది. పరిస్థితుల్ని అత నిప్పుడు వేరొక రూపంలో చూడ గలుగుతున్నాడు. నిజంగా ఆమెకు తన మీద ప్రేమ లేకపోతే తనకోసం యింత శ్రమపడేది కాదు! ఇలా గ్రహించటంలో తను యేవిధమైన పొరపాటుకూ గురి కావటం లేదు; ఎందుకంటే - ఆమె ధైర్యంచేసి ఆమాటల్ని వెల్లడిచేసింది. తను బతకటం ఎంత అవసరమో ఇప్పుడే అత నికి అర్థమవుతోంది. ఆమె చెప్పిన మాటల్ని ఇక నమ్మలేక పోవటమనేది ఇప్పుడే అతని స్వాధీనం తప్పింది. ఆ మాటల్ని ఆమె అన్నప్పుడు, ఆమె ముఖంలో దాచి వడబోసిన సత్యాన్ని మాట్లాడేప్పుడు కనిపించే వెలుగును తను చూడ గలిగాడు; అదీకాక ఆమె చిన్నపిల్లకాదు; బాధ్యత తెలి సిన, తెలివిగల చదువుకున్న పిల్ల! ఇలాంటి రత్నమే తన జీవితాన్ని వెలిగించేందుకు సిద్ధపడ్డప్పుడు—తను ఆమెకోసం ఎన్నికష్టాల్ని పడయినా, ఎన్ని శతాబ్దాలుజీవిస్తే మాత్రమేం

"శ్రీ!" అన్నాడు, ఆనందాన్ని సూచించేందుకు, నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"నా మాటలమీద మీకు నమ్మకం కలగ లేదా?"

"...అది కాదు నువ్వు ప్రేమించ దలుచుకుంటే—నాకన్న యోగ్యుడు నీకీ ప్రపంచంలో దొరక లేదా ?"

"ఇంత ప్రపంచం సంగతి నాకు తెలియదు. ఒక వేళ మీకన్న యోగ్యుడు వున్నా—యీ లోకాన్నంతట్నీ అతనికోసం వెతికే ఓపిక నాకు లేదు. అదీకాక అలా వెతికి అతన్ని కనుక్కొనేప్పటికి నేను ముసలిదాన్నికూడా ఐపో వొచ్చు !"

ఆ సున్నిత హాస్యానికి అతను నవ్వాడు.

ఆమె అంది : "ప్రేమకు ప్రత్యేక కారణాల్ని ఎవ్వరూ చెప్ప లేరు. అసలు ఆ ప్రేమించటమనేది మన చేతుల్లోది కాదేమోననికూడా నా అనుమానం. ఒకరకం మిఠాయి మీకు ఇష్టమైతే—దానికి కారణం ఏమిటో మీరు చెప్పగలరా ?"

ఈ సకారణమైన వాదనకు అతను వెంటనే లొంగిపోయ్యాడు. అనుకున్నాడు : 'శ్రీదేవి, నన్ను ప్రేమిస్తోంది. ఈలోకం యెంత నివసించదగ్గభూమి !

కాని ఇప్పుడే అతనికొక గొప్ప సందేహం కలిగింది.

"నేను బతుకుతానా ?" అన్నాడు. గొణుగుతూ.

"ఎందుకు బతకరూ? మీలో బతికే వుత్సాహమే లేకుంటే తనచేత కాదని డాక్టర్ అన్నాడు. మీరు మొండిగా వుండకపోతే అది చాలా సులభమనికూడా చెప్పాడు. నా ప్రాణాన్ని యిచ్చయినాసరే మిమ్మల్ని బతికించుకుంటాను. ...మరి నేను చెప్పినట్టు వింటారా?"

ఈ దైవస్వరూపంలోకి కృతజ్ఞతతో చూశాడు. ఆమె మాట్లాడిన ప్రతిమాటా అతనికి కొత్తజీవాన్ని యివ్వనారంభించింది.

"ఇప్పుడేకాదు; నాజన్మ అంతా నువ్వుచెప్పినట్టు వింటాను"

ఆమె మందిచ్చింది. తాగాడు. కాఫీ తెప్పించింది. తాగి ఆకలితీర్చుకున్నాడు. తనకుకలిగే లోటులన్నింటినీ తీర్చేం. దుకు సిద్ధంగాకూర్చున్న యీ దేవతకు మనస్సులో నమస్కరించుకున్నాడు.

ఉదయం పదిగంటలయినా కూతురు ఇంకా కిందికి రాలేదని ఆమె తండ్రి కృష్ణస్వామిగారు దాసీనిపిలిచి "అమ్మాయి ఏంచేస్తోందీ?" అని అడిగాడు.

దాసీదానికి ఏంచెప్పాలో తెలియక, కాస్త ఆలోచించి "పైన వున్నారు" అంది.

"ఒక్కసారి కిందికి రమ్మను—'. అన్నాడు ఆయన. కూతుర్ని పలకరించందే ఆయన ఎక్కడికీ వెళ్ళడు.

దాసీది మెట్లు ఎక్కబోతూండగా "సరే నువ్వు వెళ్ళొద్దు నేనే వెళ్తాలే" అని ఆయన మెట్లు ఎక్కనారంభించాడు. దాసీది 'ఇప్పుడు యేమవుతుందో?" నని ఆశ్చర్యపడుతూ ఆతృతతో నిలబడి చూస్తోంది.

తండ్రి గదిలోకివచ్చి, ద్వారంలో నిలబడటం ఆమె చూడలేదు. రోగికి బత్తాయి వొలవటంలో ఆమె నిమగ్నమైంది.

ఈ అస్పత్రిదృశ్యం ఆయనకు అర్థమవలేదు.

"శ్రీ!" అన్నాడు.

ఆమె తండ్రివైపు చూసింది, నిష్కల్మషహృదయం కనుక ఆమె భయపడే అవకాశాలేమీ లేవు.

"రా నాన్నా!"

ఆయనవొచ్చి కుర్చీలో కూర్చున్నాడు. "మా నాన్నగారు!" అంది ఆమె శేషుతో.

శేషు పక్కలోంచే లేచి కూర్చునేందుకు ప్రయత్నిస్తూ ఆయనకు నమస్కరించాడు.

ఆయనకు ఇతని ప్రవర్తన చాలా తృప్తికరంగా తోచింది. ఈ కాలపు యువకులకు ముసలివాళ్ళను గౌరవించటమనేదే తెలియదని ఆయన అభిప్రాయం. ఎప్పుడైనా అలా తనను గౌరవించేవాళ్ళమీద ఆయనకు సదభిప్రాయం వెంటనే కలిగేదుతుంది.

"నా స్నేహితుడు, క్లాసుమేటు, రాత్రి మన కారుకింద పడ్డాడు."

"కారుకిందనా? పాపం! బాగా దెబ్బలు తగిలినయ్యా?"

"ఒకమాదిరిగా తగిలినయ్"

"ఐనా డ్రైవరు వెధవకు అంత చత్వారమైతే" అని ఆయన గొణిగారు.

"డాక్టర్ను పిలిపించావా?"

"ఆఁ—కట్లుకూడాకట్టి వెళ్ళారు..."

"జాగ్రత్తగా చూడమని చెప్పు...పాపం!" అని ఆయన వెళ్ళిపోయ్యారు.

ఇక్కడ కృష్ణస్వామిగారిని గూర్చి కొద్దిగా చెప్తాను. ఆయన కలప వ్యాపారంలో బాగా ఆర్జించారు. భార్య కాపగానికివొచ్చిన ఇరవై యేళ్ళదాకా సంతానం కలగకపోవటం ఒక్కటే ఆయనకు జీవితంలోని లోటు. తరువాత శ్రీదేవి పుట్టింది. కాని ఆమె చిన్నతనం గడవకపూర్వమే తల్లిని పోగొట్టుకుంది. ఆ నాటినుంచీ యీపిల్లను ఆయన అతిగారాబంగా పెంచుకుంటూ వొచ్చాడు. అధునిక నాగరికత తనలోలేదని భార్య చాలాసార్లు పోట్లాడేది; ఆమె తన కూతుర్ని అధునికంగా పెంచి పెద్దదాన్ని చెయ్యాలని ప్రయత్నించేది. ఇది ఆయనకు అప్పట్లో అంతయిష్టంగా లేకపోయినా — భార్య పొయ్యాక యీ నాగరికతమీద వ్యామోహం చప్పున ఆయనలో పెరిగి పోయింది. భార్య

లేకపోవటంవల్ల—ఆమె ఆశయాలన్నీ యీ కుమార్తెలో తీసుకరావాలనే ఆయన సంకల్పం బాగా దృఢపడ్డది.

అందుకనే శ్రీదేవిని చూచినవాళ్ళు అధునిక యువతి అనకమానరు. తల్లి అయినా తండ్రయినా తనే కావటం వల్ల శ్రీదేవికి ఆయన దగ్గర అమితమైన చనువు ఏర్పడింది. ఆడింది ఆటా, పాడింది పాటగా యీ పదిహేడేళ్లూ గడిచి పోయినై. కూతురు పెద్దచదువులు చదువుతూ ఆనందంగా కాలం గడుపుతూండటాన్ని చూసి, కృష్ణస్వామి ఆనందిస్తూ—నాగరికత అంతా తన ఒక్కడి యింట్లోనే వున్నట్టు గర్వపడ సాగాడు.

ఒక సంవత్సరంనుంచీ ఆయనకు ఇంకొక్క భారం మాత్రం మీద పడ్డది. అది శ్రీదేవి వివాహం. ఈకూతురు విషయం తనే తల్లిగాకూడా ప్రవర్తిస్తూండటంవల్ల ఆయన దీన్నిగూర్చి చాలాసార్లు ఆమె దగ్గరే అన్నాడు.

"సరే నాన్నా! అదిఅంత అవసరమైనప్పుడు చూద్దాం" అనేది ఆమె.

"నువ్వు బాధ్యత తెలిసినదానివని నాకు తెలుసు. ఇది నీ వివాహవిషయం కనుక ఇతర విషయాల్లో నీకున్న స్వాతంత్ర్యమే ఇక్కడకూడా వుంది. నాకు కొడుకులు లేరనే విచారమేమీ లేదు. కాని నీకు ఒకభర్త చాలా అవసరం... ఒక్కటి ఆలోచించు: ఈ ముసలిప్రాణి అతాత్తుగా ఎప్పుడో ఎగిరిపోతుంది. అప్పుడు నీకు అండ ఏదీ?"

ఆమె మాట్లాడకుండా వూరుకుంటుంది.

"నీ భర్తను నువ్వే ఎన్నుకో. అతను ఎలాంటివాడైనా నాకు యిష్టమే. ధనవంతుడూ, రూపవంతుడూ, విద్యావంతుడూ అల్లుడవ్వాలనే పట్టుదల నాకేమీ లేదు. అది నీ స్వవిషయం"

శ్రీదేవి నవ్వి తలవూపుతుంది.

"సాధ్యమైనంతత్వరలో ఇది పూర్తవ్వాలి—"

అంతే! ఆయన యీ విషయంలో అంతకన్న యింకేమి అనడు.

# 6

సాయంత్రందాకా శ్రీదేవి అతని ప్రక్కన అలాగే కూర్చునివుంది. అతను నిద్రపొయ్యేందుకు ప్రయత్నించలేదు. ఆమె అందాన్నిచూస్తూ ఆనందిస్తున్నాడు. ఇది ఆమెకు చాలా యిబ్బందైన విషయంగావుంది. కాని ఇంకో దారి లేక వూరుకోవాల్సి వొచ్చింది. సౌఖ్యపడు తూన్నప్పుడు వొచ్చే సౌఖ్యంకన్న—కష్టపడేప్పుడు వొచ్చే అదేసౌఖ్యం అనేకరేట్లు పెద్దదిగాతోస్తుంది. ఇప్పుడు శేషు ఆ స్థితిలోనే వున్నాడు.

సాయంత్రం డాక్టర్ వొచ్చి, "ఎలావుంది?" అన్నాడు.

శేషు డాక్టర్‌కు పడుకునే నమస్కరించి "నా ప్రాణాలు మీ చేతుల్లో వున్నయ్" అన్నాడు ప్రార్థనాపూర్వకంగా.

తను అనుకున్న దానికన్న ఎక్కువ మార్పే కనిపించటం వల్ల డాక్టరు చాలా తృప్తి పడ్డాడు.

"మీకు తప్పకుండా నయమౌతుంది; మీ రేమీ నిరాశ పడకండి" అన్నాడు డాక్టరు.

ఆ మాటలు శేషులో గొప్పమార్పును తేగలిగినయ్, తనకు ఇప్పుడే లేచి తిరిగేటంత బలంవొచ్చినట్టు తోచింది.

శ్రీదేవిని అవతలికిపిలిచి, డాక్టరు నవ్వుతూఅన్నాడు: "చూశావా.. అంతా నీ చేతుల్లోనే వుంది"

తనచేతుల్లో ఏముందో ఆ పగలంతా ఆమె ఆలోచిస్తూనే వుంది; కాని ఆమె కేమీ సమాధానం దొరకలేదు. ఎవరి శక్తి వాళ్ళకు తెలియకపోవటంవల్లనే లోకం మామూలుగా సాగిపోతూన్న సంగతి ఆమెకింకా తెలియలేదు:

"మీ విజ్ఞానంవల్లనే—"

ఆమెను పూర్తిగా మాట్లాడనీకుండా "రోగిని కాస్త జాగర్తగాచూడు. నామందుకన్న నువ్విచ్చే డోసులే బాగాపనిచేస్తయ్. అతన్ని నిరాశపడనీవొద్దు, ఇంకో పది రోజుల్లో లేచి తిరగొచ్చు"

ఆమె డాక్టర్‌కు నమస్కరించింది: డాక్టరు సంతోష పడి వెళ్ళిపొయ్యాడు.

శేషంలో కొత్తశక్తి ప్రవేశించింది; దాని ప్రభావంవల్ల మందుకూ మాకులకూ లొంగని అనేక వ్యాధులు కుదురుతయ్. తను బ్రతికివుండడం ఎంత అవసరమో అతనికి ఇప్పుడే అర్థమైంది. బతికి అనుభవించబొయ్యే అనేక సౌఖ్యాల్ని గూర్చి అతను అంతులేని ఆలోచనలో పడ్డాడు. మందు తాగటంలోనూ, ఆహారం తీసుకోవటంలోనూ అతను డాక్టర్ సలహాల్ని, శ్రీదేవి సలహాల్ని అక్షరాలా ఆచరణలో పెట్టసాగాడు.

పగలంతా ఆమె అతని పక్కనే కూర్చొని చదువుకో సాగింది. కాని ఒక పురుషుడు — తనవంక అదేపనిగా చూస్తున్నాడని ఆమెకు క్షణక్షణమూ తెలుస్తూండటంవల్ల చదివేవాంట్లో ఒక ముక్క కూడా అర్థమవటంలేదు. ఆ చూపు తనపైన అనేక ఆశలకు పునాది అనే విషయం ఆమెకు మరీ కష్టంగా వుంది.

రాత్రి చాలా పొద్దుపొయ్యేదాకా అతను నిద్రపోలేదు: అదేపనిగా ఆమె ముఖంలోకి చూడటం తప్ప అతను ఇంకేమీ చెయ్యలేక పోతున్నాడు. ఆ ఆనందం అతని వాక్కును కట్టేసి నట్టయింది.

"మీకు విశ్రాంతి చాలా అవసరం: నిద్రపోండి" అంది ఆమె.

"నిద్ర రావటంలేదు"

"కాని డాక్టరు విశ్రాంతి అవసరమని చెప్పాడు"

తనకు తోచిన మాటలకన్న డాక్టరు చెప్పిన మాటల మీద అతనికి ఇప్పుడు అమితగురి ఏర్పడ్డది. అందుకని బల వంతాన కళ్ళు మూసుకొని నిద్రపట్టించు కునేందుకు గట్టిగా ప్రయత్నించ సాగాడు.

ఆమె కూడా ఆ గదిలోనే ఇంకోమూల పడుకొని పరిస్థితిని సింహావలోకనం చేయసాగింది. తనలో ఒక ప్రాణిని బతికిం చేందుకు సహాయపడే 'సంజీవి' వుందనే విషయం రూఢి పడ్డాక, ఆమె ఆశ్చర్యపడ సాగింది. తను చేస్తూన్న యీ ప్రాణదానంతో ఆమె తనజీవిత మేధన్యమైనదనితలిచింది...

కాని ఇదంతా నాటకమని తరువాత తెలుస్తే అతను ఎంత బాధపడతాడో? తన కోసంగా బతికే అతనికి అది కల్పించే నిరాశ ఎంత దూరం లాక్కు పోతుందో ఆమె వూహకు తోచలేదు. ఏమైతే నేం. అతను బతుకుతాడు. ఆ తరువాతి పరిణామంతో తనకు సంబంధంలేదు. చేదు మందును విసర్జించే రోగి విషయంలో మాయమాటలు చెప్పి దాన్ని తాగించేలాటిదే...ఇప్పటి తన యీ విధి:

తనను ప్రేమిస్తున్నట్టూ - తను ఆతని భార్యయినట్టే అతను తనవైపుచూసే ఆ చూపుల పదున్ను ఆమె భరించ లేక పోతూంది. తీవ్రవాంఛతో అనేకమంది పురుషులు తనవైపుచూసే బజారు చూపులకు ఆమె బాగా అలవాటు పడ్డది. కాని యీ చూపుకు తను కదలకుండా, మెదలకుండా తన అంగీకారాన్ని సూచిస్తూ కూర్చోవాలి. ఎంత కష్టం!

నటన ఎంత బాధావహమైంది: తనలోని శక్తులన్నింటినీ కట్టిపెట్టి అవతలి చూపులకు తలవాల్చటం అతను నుకున్నంత తేలిగ్గామాత్రం లేదు.

లోతుపాతులు తెలియకుండానే తను యీ ప్రవాహం లోకి దిగింది : కాని ఇది తనను యెక్కడికి లాక్కుపోతుందో ఊహించలేని పరిస్థితయింది. ఇంతదూరం వొచ్చాక ముందుకుసాగటం ఎంత కష్టమో, వెనుక్కుపోవటంకూడా అంత కష్టంగానూవుంది. కిక్కురుమనకుండా దీని పర్యవసానం తెలుసుకోవాల్సిందేకాని ఇంకోదారేమీ కనపడటం లేదు.

ఇలా ఆలోచిస్తూనే ఆమె నిద్ర పోయింది.

ఒకరాత్రివేళ శేషుకు మెలకువ వొచ్చింది. ఆ పగలు జరిగిందంతా అతినికి వరసాగ్గా జ్ఞాపకంరాసాగింది. గది నంతట్నీ ఆక్రమించిన ఎలక్ట్రిక్ లైట్ వెలుగులో కనిపించే అందమైన ఆమె ముఖాన్ని చూడగానే—తను స్వర్గానికి ఒక్కమెట్టులోనే వున్నట్టనిపించింది. చెదిరిన ముంగురులు ఫాల భాగంమీదపడి ఆమె ముఖానికి కొత్త శోభను తెచ్చి పెట్టినయ్. ఈమె కోసం—ఈ రత్నం కోసం తనుబతుకుతున్నాడు: రాత్రివేళ తనకు ఏమన్నా కావాల్సి వొస్తుందేమోనని ఆమె ఆగదిలోనే పడుకున్నది ; ఇది తలచినప్పుడు అతను తనను తనే మరిచిపొయ్యాడు.

తను యీ పునర్జన్మమెత్తి చెయ్యాల్సిన అనేక పనులు అతనికి గుర్తుకు వొచ్చినయ్. పక్కలో ఎలాగో లేచి కూర్చున్నాడు. ఏనాటికలలో యీనాడు నిజంగా జరుగుతూ న్నట్టనిపించింది. అతనిఆలోచన అంతు లేకుండా అన్ని వైపులా విస్తరించసాగింది.

నిద్ర తెప్పించుకోవాలని గట్టి ప్రయత్నం చేశాడు. కాని యేమీ లాభం లేకపోయింది. అలాఆలోచిస్తూ కూర్చో వటంతప్ప ఇంకోమార్గమేదీ అతనికి కనిపించలేదు. నిరాశలో ఎంత బాధవుందో—ఆశలోకూడా అంతేనేమో?

## 7

తెల్లవారాక ఆమె అడిగింది ; "మీకు ఎలావుందీ?"

"ఇంకేముందీ—ఎల్లుండికల్లా లేచి తిరుగుతాను"

ఆమె నవ్వింది. ఒక నిరాశా పూరితుడు, వృథాగా ప్రాణాలు పోగొట్టుకునే వాణ్ని—తను బతికించగలిగిన తన విలువ ఆమెకు బాగా అర్థమైంది. కాని తన విలువనంతట్నీ గ్రహించగలిగిన వ్యక్తి యీప్రపంచంలో ఒక్కడే ఉన్నాడు —అతడే శేషు!

"డాక్టరు చెప్పేవరకూ మీరు లేచి తిరిగేందుకు వీల్లేదు—" అంది ఆమె.

"నాశక్తి నాకు తెలుసు; కాని డాక్టరుకు కాదుగా:"

ఆమె మళ్ళీ నవ్వింది. చిన్నపిల్లల్తో ఆడుకునేప్పుడు కలిగే ఆనందం లాటిది ఆమె అనుభవిస్తోంది.

డాక్టరు మామూలుగా వొచ్చి చూశాడు.

"ఎలావుంది?" అందామె.

"చాలా నయం. ఇంకా నాలుగైదు రోజుల్లోనే—"

ఆమె జీవితంలో మొట్టమొదటిసారి తన విధికి హృదయ పూర్వకంగా నమస్కరించింది. పోగొట్టుకుంటే తిరిగి సంపాయించలేని అమూల్యమైన వస్తువును తన శక్తినంతట్నీ ధారవోసి కాపాడుకున్నంతగా ఆమె భావించి వుంటుంది.

"నాకు బాగా నయమయ్యేదాకా నువ్వు ఎక్కడికీ వెళ్ళొద్దు శ్రీ! — నువ్వు లేకపోతే నాకేమీ తోచదు" అన్నాడు శేషు.

"సరే—" అనక తప్పిందికాదు.

ఆమెకు ఇదొక బందిఖానా ఐంది. తన చేతులారా తెచ్చి పెట్టుకున్న దవటంవల్ల దాని బాధను అనుభవించేందుకు ఆమె సిద్ధపడ్డది. తను చేసేపని ఒక సత్కార్యమనీ, దాని విలువ ఒక మానవ ప్రాణమనీ ఆమెకు గుర్తున్నంతసేపూ ఇదివొక బాధగా ఆమె ఎంచలేని స్థితిలోకూడా ఉండటం గలిగింది.

ఐదురోజులవరకూ ఆమె అలాగే సేవచేస్తూ వొచ్చింది. రోగి డాక్టరు తలిచినదానికన్న ఎక్కువ ఆరోగ్యాన్ని పుంజుకో గలిగాడు.

ఆరవనాటి అర్ధరాత్రి—

కలత నిద్రలో ఆమె మేల్కొన్నది. పక్కమీద శేషు లేడు. ఆమె గది అన్నిమూలలా వెతికింది. ఎక్కడా లేడు. కిటికీలోంచి బైటికి చూసింది. చంద్రుడు దేదీప్యమానంగా వెలుగుతున్నాడు. అయాచితంగా చెట్లువీచే చల్లగాలికిఆమె ముంగురులు నాట్యమాడ సాగినయ్. కాని శేషుఏమైనట్టూ?

తన యీ దయను భరించలేకనో, లేక తనది నటనే నని గ్రహించో మళ్ళీ చావుకు సిద్ధమయ్యాడా? ఇది తలుచు కున్నప్పుడు ఆమె తనలోని శక్తంతా నశించినంతగా బాధ పడ్డది. తను విశ్వప్రయత్నంమీద అతన్ని మృత్యుదేవత నోటినుంచి వెనక్కు లాక్కురాగలిగింది. అదంతా వృధా యేనా? తను చేసిన పనుల్లో లోటేమున్నా ఉన్నదేమో? నిజంగా ఉన్నట్టయితే-తనది గొప్ప నేరమే అవుతుంది: హత్యకూ దీనికీ తేడా ఉండదు: తన విధి ఎన్నటికీ ఆ నేరాన్ని క్షమించలేదు:

కలతచెందిన హృదయంతో — ఆత్రుతతో ఆమె మళ్ళీ వెదకసాగింది. దక్షిణంవైపు తలుపు దగ్గరగా వేసి వుంది. బహుశా అతను ఆదారినే వెళ్ళివుంటాడు. ఎక్కడికీ? ఈ విశాల విశ్వంలోకి—ఒంటరిగాడై, రోగిష్టయి, అశక్తు డయి—ఎంతదూరం, ఎవరికోసం వెళ్ళి ఉంటాడు?

చకచకా ఆమె తలుపు తెరిచి ముందుకు సాగింది. ముంగిలిలోని కుర్చీలో కూర్చొని శేషు చంద్రుడిలోకి చూస్తు

ప్పడు. తెల్లని వెన్నెల్లో శిలావిగ్రహంలాగు కదలకుండా ఆ
ందమామను గూర్చి ఏమో ఆలోచిస్తున్నాడు. ఆమె
ళ్ళ సవ్వడికూడా అతని ఊహల్ని భంగపరచలేదు.

అతను కనపడగానే ఆమెకు ధైర్యం వొచ్చింది. కాని
తను ఏ ప్రకృతి శక్తులకు తలవొంచి తన్మయుడౌతు
న్నాడో ఆమెకు తెలియలేదు. మాట్లాడకుండా ఆమెకూడా
తని వెనకనే నిలబడిపోయి చందమామ సౌందర్యాన్ని
ాడసాగింది.

కొంతసేపటికి మెల్లిగా అతనికిపక్కనేవున్న కుర్చీలో
ూర్చుంది. అతని కళ్ళనుంచి నీరుకారుతోంది. నిర్భాగ్యుడు
—మళ్ళీ ఏ క్రూరపు ఆలోచనల్ని అనుభవిస్తూ యీ అర్ధ
ాత్రి ఏడుస్తున్నాడు!

"మీరు...విచారపడుతున్నారు." అంది మెల్లిగా.

శేషు తుళ్ళిపడి, కళ్ళు తుడుచుకుంటూ—ఏడుపులోనే
నవ్వుతూ "నువ్వా—ఎవరో అనుకున్నాను :" అన్నాడు:

"మీరిక్కడికి ఎలావొచ్చారు?"

"గోడలుపట్టుకొని మెల్లిగా నడిచి వొచ్చాను"

"నడిచా! మీరు ఇంకా రెండుమూడు రోజులదాకా
కదలకూడదని డాక్టరు చెప్పాడు. పోనీ నన్ను లేపలేక
పోయ్యారా?"

"శాస్త్రప్రకారంగా కాకుండా—నేను బాగా ఆరో
గ్యంగానే ఉన్నాను. నాశక్తి సరిపోతుందనే నమ్మకంతో

నన్ను లేపనేలేదు. ఐనా—నీ నిద్రకు భంగం కలగకుండానే నేను రాగలిగాను—''

''అలాంటి పనులు చెయ్యకండి : మళ్ళీ ప్రమాదం సంభవిస్తుంది''

''ఫర్వాలేదు'' అని శేషు చప్పరించాడు.

''మీరు ఇక్కడికి ఎందుకు వొచ్చినట్టూ ? మీ కళ్ళనుంచి ఎందుకని నీరు కారుతోంది ?''

''నాకు నిద్రపట్టలేదు. ఇక్కడకూర్చొని యీ ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూంటే—మనకోసం ఎంత ఆనందం వెదజల్లివుందో ఆలోచిస్తూ—ద్రవించి పోతున్నాను...''

'మనకోసం' అన్నప్పుడు ఆమె శరీరం పులకరించింది.

''మీకు విశ్రాంతి చాలా అవసరం. నిద్రపోవాలని డాక్టరు చెప్పాడు.''

''డాక్టరు చెప్పాడేమో—కాని అందుకని నిద్రవొస్తుందా ? అదీకాక పాతికేళ్ళూ నిద్రపోతూనే ఉన్నాను - అంతకన్న గత్యంతరం లేక, ఇక నీలాంటి అదృష్ట దేవతను ఎదురుగా పెట్టుకొని నిద్రపోగలనా ?—''

''ఏమిటా అదృష్టం ?'' అందామె.

''లోకానికి ఒక్కడే చంద్రుడు. కాని నాకు ఇద్దరూ—''

''ఎక్కడా ?'' అని ఆమె ఆశ్చర్యంతో ఆకాశంలోకి చూసింది—ఇద్దరుచంద్రు లున్నట్టు ఆమె ఎక్కడా చదవనైనా లేదు !

"నీకు కనిపించరు...నీ నీలపు కనుపాపల్లో ప్రతిఫలించే యీ ఇద్దరు చంద్రులూ...ఒక్క చంద్రుణ్నే యీ సామాన్య హృదయం భరించలేను. కాని ఇద్దరుచంద్రులిచ్చే ఆనందాన్ని అనుభవించేందుకు నేను సిద్ధమవ్వాలి–"

ఆమెకు యీ ధోరణి బాగా అర్థమైంది. ఇలాంటిమాటలే ఇంకా వినాలని కుతూహల పడ్డది. తను మాట్లాడి ఆకాస్త పాడుచేస్తానేమోననే భయంతో ఆమె అలాగే కూర్చొని పోయింది.

"శ్రీ! యీ రాత్రల్లా ఇలాగే కూర్చుందాం. తెల్లవారి పోనీ! తెల్లారుతే మళ్ళీ ఆ చంద్రుడు ఉండడు. రేపురాత్రికి మళ్ళీ వొస్తాడు. కాని ఇప్పుడు యీ కాస్తా చెడగొట్టుకొని–రేపటి దానికోసం వేచి ఉండటం దేనికి?"

ఆమె దీనికి ఇష్టపడ్డా ।అతనిఆరోగ్యం సంగతి జ్ఞాపకం రానటంవల్ల అంది; "మీకు విశ్రాంతి అవసరం..."

ఆమాట పూర్తి కాకుండానే అతను అన్నాడు; 'డాక్టర్ చెప్పాడు...ఔనా? కాని డాక్టరు యీ మిగతా వన్నీ చెప్పడు. రోగే గ్రహించుకోవాలి. అందుకని—ఇక రోగి చెప్పినవన్నీ చెయ్యాల్సి వుంటుంది. డాక్టరు చెప్పినవి మాత్రం కాదు—తెలిసిందా?"

ఆమె విరగబడినవ్వింది. ఇక అతని మాటలకు ఎదురు చెప్పలేని అసమర్థురాలై పోయింది. చందమామను గూర్చి నక్షత్ర శాస్త్రాలయంలో అతి పట్టుదలగా 'స్టడీ' చేసే ఇద్దరు

విద్యార్థుల్లాగు వారు అలాగే చందమామలోకి చూడ సాగారు. కాని వాళ్ళు విద్యార్థుల్లాగు ఆ చందమామలో ఏ మున్నదనే మీమాంసతో బాధపడేందుకు మారుగా చంద మామ ఇచ్చే ఆహ్లాదాన్ని మాత్రమే అనుభవించసాగారు. ఇద్దరి హృదయాల్లోనూ ఆ ఒక్క చందమామే వివిధ భావాల్ని రేకెత్తించేందుకు ప్రయత్నం చేసింది.

కాలచక్రంతో పాటే చంద్రుడు కూడా ప్రయాణం చేస్తున్నాడు. అంతకంతకు చంద్రుడికాంతి పెరగజొచ్చింది. శ్రీదేవి ముఖంలోని కాంతికూడా అంతకంతకు పెరుగుతూ న్నట్టు తోచింది — అతనికి. మానవుడి ఊహామాత్రమే అందుకోగల ఆకాశంలోని చందమామనుంచి—తన పక్క నేవున్న యీ చందమామమీదికి మరలింది —అతనిదృష్టి. ఆమె ముఖంలో ముఖముంచి ఆనందిస్తున్నాడు. అది కాంక్ష కాదు; వింతవస్తువును చూద్దామనే కుతూహలమూ కాదు. బతికిన రోజుల్లో సగంకాలం చూడగలిగే ఆ చంద మామలో యీనాడు ఏమంత కొత్త విశేష ముందనీ చూడ టం? ఎన్నాళ్ళయినా వెన్నెల్లోని చల్లదనం కొంతైనా తగ్గ కుండా కొత్తగా ఉన్నట్టే తోస్తుంది! అపని ప్రవర్తనను కూడా దీనితో పోల్చవచ్చు.

"ఎందుకూ అలా చూస్తారు?" అందామె. మృదు వుగా.

"చూడకూడదా? ఆ చందమామను చూసేందుకు నువ్వే కారణాన్ని చెప్పగలవో, నిన్ను చూసేందుకు కూడా నేనూ ఆ కారణాన్నే చెప్పగలను."

"అంత కొత్తదనం వుందా నాలో?"

"ఉన్నది; అది ఎన్నటికీపోదు. అదీ కాక - నాకు జీవం పోసిన వ్యక్తిని—నాపైన అనురాగమున్న ఏకైక ప్రాణిని ఆరాధించటం తప్పా? మరీ — నువ్వే నాదానివని తెలిచి నప్పుడు—"

ఇక భాషకు అందని భావాల్లోకి దొర్లిపోయి అతను కళ్ళు మూసుకున్నాడు ఆమెకూడా కొన్ని నిమిషాలపాటు యీ లోకాన్ని వొదిలించుకొని ఊహాలోక విహారంలోకి పోయింది.

చప్పున తెలివి తెచ్చుకుంది. ప్రేమ అంటే ఏమిటో ఆమెకు అప్పుడు బాగా అర్థమవసాగింది. ఇంతకుముందు అత నన్నమాటలే ఇంకెవరైనా అని వుంటే నిజంగా తను లెక్క చేసేదికూడా కాదు; మొహంలో నవ్వే పూరుకునేది. కాని ఇక్కడ ఇక శక్తులూ, ఊహాలూ అన్నీ పని చెయ్యటం మానుకొని... శేషు సహాయంతో మాత్రమే ఆమె కొత్త ఊహల్లోకి జారబడుతోంది. ఆ వూహాలు తను ఎరగని కొత్త ఆనందాన్నిస్తూండటంవల్ల ఆమె ఆటంకపరచలేదు. తను లొంగిపొయ్యానని గ్రహించేందుకు ఆమెకు ఎక్కువ కాలం పట్టలేదు.

వెంటనే కొత్తరకం సిగ్గు ఒకటి ఆమె వెంటపడ్డది. కావాలని తెచ్చుకుంటే వొచ్చేరకం సిగ్గుకాదది. మందు తాగించేప్పుడు కలిగే స్పర్శజ్ఞానంకూడా ఆమెలో ఆ 'సిగ్గు'ను రేకెత్తించలేదు.

"నావైపు అలా చూడకండి. నాకు బాగుండదు" అంది తలవొంచి.

"ఎందుకనీ ?"

"నన్ను కారణం అడగొద్దు—"

"నిన్ను కొరుక్కు తినటం లేదుకదా ?"

"ఐతే...మీ ఇష్టం"

మంచులో ఆమె చీరె తడిసిపోయింది. శేషు ఆమె పమిట చెంగును వేలికి చుట్టుకుంటున్నాడు.

"ఏమిటీ ?"

"అబ్బ! ఎంత చల్లాగావుందీ ?"

ఆమె చెక్కిళ్ళను తాకుతూ అన్నాడు: "మంచులో తడిసిపోతున్నావ్"

"మీరూనా—"

"నా మాటకేం ?"

"ఇంక ఇక్కడ వొద్దు...వెళ్ళిపోదాం"

"నాకు నిద్రరాదు—"

"నేను జోలపాడతాను"

"ఔను ... చిన్నప్పుడు అమ్మ జోలపాడితే నిద్ర వొచ్చేది...మంచి ఉపాయమే ఆలోచించావ్ ... ఐతే పోదాం-"

ఆమె ఆధారంగా వుండి మెల్లిగా అతన్ని లోపలకి జేర్చింది. అతన్ని పడుకోబెట్టి అతని ఫాలభాగంమీద చెయ్యివేసి, "ఇక నిద్రపోండి—" అంది

"జోల పాడవూ?"

"ఇప్పుడు కాదు...ఎవరైనా వింటారు—".

ఇక మారు మాట్లాడకుండా అతను కళ్ళు మూసు కున్నాడు.

అతను నిద్రపోగానే చాలాసేపు బిగపట్టిన ఊపిరిని యిప్పుడే వొదిలినట్టు—చాలా శ్రమపడి దూరంనుంచి మొయ్యలేని బరువును మోసుకొచ్చి ఇప్పుడే వొదిలించు కున్నట్టు—హృదయాన్ని తేలికపరిచే ఒక్క నిట్టూర్పు విడిచింది.

## 8

ఉదయం—డాక్టర్ వొచ్చేటప్పటికి అతనింకా నిద్ర లేవలేదు.

"పడయినా మెలకువ రాలేదా?" అన్నాడు డాక్టర్.

"రాత్రి చాలాసేపటివరకూ మేలుకొని వున్నారు" అంది శ్రీదేవి.

"ఎందుకనీ? విశ్రాంతి చాలా అవసరమని చెప్పానే?"

"ఆయనకు నిద్రరాలేదట. నాకు తోచక వరండాలో కూర్చొని వుంటే — అతనూ వొచ్చి కూర్చున్నాడు—"

"ఒక్కడూనా? ఎలా నడవగలిగాడూ!" అన్నాడు డాక్టర్, ఆశ్చర్యంతో.

"ఏమో!"

డాక్టర్, తనమందు ప్రభావమేమోనని పొరబడ్డాడు.

ఆమె అంది: "మూడు గంటలదాకా అలాగే కూర్చున్నాడు. నేను చాలాదూరం చెప్పి చూశాను; కాని వినలేదు. తన శక్తి తనకు తెలుసని వాదించాడు. అతని ఆనందాన్ని చెడగొట్టకుండా వూరుకోక తప్పిందికాదు."

డాక్టరుకు విషయం అర్థమైంది. తల ఆడించి అన్నాడు: "ఔను...అనుకున్నదానికన్న త్వరలోనే అతను కోలుకుంటాడు."

"ఎందుకనీ?"

"ఈ చావుబతుకులకు వ్యవహారాలు మామూలుగా సగం రోగి హృదయారాటంమీద ఆధారపడి వుంటయ్. ఇప్పుడు అతని హృదయం ఎంత తేలిగ్గావుందో ఆలోచించు. అతని ఆశల్ని నువ్వు ఎంతవరకూ ఎత్త గలిగావో నీకు అర్థ

ఎవటం లేదు. ఆ స్థితిలో రోగి లేచి నిలబడ్డాడంటే—
ోకంలోని శాస్త్రజ్ఞులందరూ కలిసి...అతి విలువైన
ందుల్ని ఉపయోగించినా—లాభం లేకపొయ్యేది. ఆ పని
వ్వు చేయించగలిగావ్. శాస్త్రజ్ఞానానికి లొంగనిది—
లాటి రూపసికి తలవొంచింది. నువ్వు ఎంత గొప్పగా
ించి వుంటావో ఇప్పుడు నేను బాగా తెలుసుకున్నాను.''

'నటన' అనే మాట విన్నప్పుడు ఆమె హృదయం అదిరి
డింది. తన మాటల విలువ ఒక ప్రాణదానమన్న విషయం
ఆమె నమ్మక తప్పలేదు.

''సరే...అతన్ని లేననీ...ఇవ్వాళ మందు మారు
స్తాను. ఐదారు రోజుల్లో అతను మామూలు మనిషవు
తాడు.''

డాక్టర్ వెళ్ళిపొయ్యాక ఆమె చాలాసేపు ఆలోచిం
చింది. ఇప్పుడు ఆమెను ఒక గొప్ప సమస్య ఎదుర్కొంది;
తను నటించిందా? లేదా? తన నటన ఎంతదూరం వెళ్ళిం
దంటే—'నటన' కూ నిజంగా జరిగే సంఘటనకూ భేదం
తెలియని స్థితి వొచ్చిందన్నమాట. అదే 'నటన' అయితే
—అంతకన్న 'కల' అయితే బాగుండేది! నటన! తను
ఇంత కష్టపడ్డది—అదంతా విలువలేని నటనా! అంతకన్నా
మంచి పేరే ఆ కష్టానికి కరువైందా? తనెంత నిర్భాగ్యు
రాలు!

"(శ్రీ)! "

అతని పిలుపు ఆమె ఆలోచనల్ని భంగపరిచింది.

"అబ్బ! ఎంత మంచి కలనొచ్చింది!"

"ఏమిటీ? కలా? కలతో ఇంత తన్మయం అయ్యాడని ఆమెకు నవ్వు వొచ్చింది.

"ఔను...కల! ఎంత గొప్ప కల!"

అని బిగ్గరగా, తృప్తిగా నవ్వి అన్నాడు; "విను: అంతా ఊహించినట్టే ఐంది. నీకూ నాకూ పెళ్ళయింది, మన దాంపత్య సౌఖ్యం...మనకొక అందమైన బిడ్డ!": ఇక మాటలే దొరకనట్టు అతను ఊరుకున్నాడు.

ఆమె మెల్లిగా కళ్ళుమూసింది — యీ పాడు ప్రపంచాన్నీ, నిజాన్నీ—కాస్సేపన్నా మరిచిపోయి—ఆ స్వప్న సౌఖ్య ఛాయనన్నా కొంతసేపు అనందిద్దామని కాబోలు!

తనకూ అతనికి వివాహం! ఎంత మధురం! తన పెళ్ళి సంగతి ఇప్పుడే ఆమెకొక సమస్యగా తోచింది. ఆ అతి భారమైన సమస్య—రెండు సంవత్సరాలుగా తనకు కనిపించకుండా తనను వేధించే సమస్య—ఎంత తేలిగ్గా తీరిపోయింది! కాలం ఎలాంటి సమస్యనైనా ఇట్టే తీరుస్తుంది కాబోలు! జీవితంలో అసలు తను ఎప్పటికన్నా ఏ పురుషున్నైనా ప్రేమించగలనా అనే అనుమానానికి గురైన క్షణాలుకూడా వున్నాయ్. కాని అంతా ఒక కలకన్నా తక్కువ కాలంలో జరిగిపోయింది!

బిడ్డ! ఎంత మధురం! ఇతర్ల బిడ్డల్ని తను యెత్తు
ని ఆడించి ఆనందించేది. అటాంటిది తనబిడ్డే అయితే-?
నలో దాగివున్న యీకోర్కెను ఇన్నాళ్ళు తనెలా భరించ
లిగిందీ?

"ఏం కల!—జీవితంకన్నా కలఎంత మధురమైంది!"
న్నాడు శేషు. కల అన్నమాటను ఇప్పుడే ఎవరో జ్ఞాప
చేసినట్టయింది-వెంటనే మళ్ళీ యీ భూమిమీద పడ్డది.
ల అని తెలియనప్పుడు వుండే ఆనందం—తెలుసుకున్నాక
తుంది కాబోలు! ఏన్నో విషయాల లోతులు మనకు
లియక పోవటంవల్లనే ఆ ఆనందాన్ని అనుభవించ గలుగు
న్నామేమో? నిజంగా కీలకం అర్థమైతే ఆవిషయం మన
ష్టిలో ఎంత తేలికై పొయ్యేందుకైనా అవకాశం
టుంది!

అతను మాట్లాడిన మాటలకు యేమీ రాడకుండా ఇష్ట
ట్టు వూహించుకున్నందుకు ఆమె సిగ్గుపడ్డది. నటించే సిగ్గును
కోవచ్చు కాని—దానంతట అదిగా వొచ్చేదాన్ని ఆపు
టం ఎలా? అలాగే తన నటనకూడా క్రమంగా నిజంగా
రిందనేందుకు సందేహం లేకుండా పోయింది.

తిరిగి మాట్లాడబొయ్యే అతన్ని చేత్తో వారిస్తూఅంది:
కేమీ మాట్లాడవొద్దు... నేను వెళ్ళిపోవాల్సివొస్తుంది"
"వెళ్తావా? నన్ను ఒంటరిగా వొదిలి వెళ్ళిపోతావా?"
షు దీనంగా ఆమె చేతిని పట్టుకొని.

"వెళ్ళను...కాని అలా మాట్లాడవొద్దు."

"నేను నిజం చెప్తున్నాను. కలైతేమాత్రం ఆనందం లేదా? జీవితంలో ఆకలకైనా నోచుకోని నాకు అది ఎంత ఆనందాన్ని ఇచ్చివుంటుందో నువ్వు ఆలోచించలేకుండా వున్నావ్. ఈ సౌఖ్యమయ జీవితానికి అలవాటుపడ్డ నీకు ఇది అతి సామాన్య విషయమే కావొచ్చు. కాని నాకు మాత్రం అది ఎంత చెప్పుకోదగ్గ విషయమో తెలుసా? నీకు కష్టం కలిగించినట్లయితే—నన్ను క్షమించు."

"ఇందులో క్షమించేందు కేమీలేదు. మీరు అనవసరంగా బాధపడకండి."

ఆమె అక్కడ నిలబడలేక అవతలికి వెళ్ళింది. తన మీద కలలుకనేవ్యక్తి! ఈ లోకంలో తను చెయ్యగల ఘనకార్యం ఇంతకన్న యేముందీ? అతను కన్నకల ఇప్పుడే నిజమైతే ఎంత బావుంటుంది!

పదిరోజులు గడిచినయ్, శేషు పూర్తిగా ఆరోగ్యాన్ని సంపాయించ గలిగాడు.

ఆమె డాక్టర్ను యీ సందర్భంలో చాలా అభినందించింది.

"మీ గొప్పేమీ లేదు. అంతా నీ గొప్పే!" అన్నాడు డాక్టర్.

"పోనీండి, మీ ఋణం యెలా తీర్చుకునేదా అని ఆలోచిస్తున్నాను."

"అదికూడా నేను చెప్పాలా?" అన్నాడు డాక్టర్.

"చెప్తే కృతజ్ఞురాల్ని"

డాక్టర్ సాలోచనగా ఆమె ముఖంలోకి చూశాడు. కాని ఆమె అమాయకత్వం తప్ప అతనికి ఇంకేమీ కనిపించ లేదు.

"శ్రీ! ఇంకా నాచేత చెప్పించుకునే యీడులో నువ్వు లేవు. నీకు తెలుసు. సంవత్సరం నుంచీ నీకోసం కుక్కలాగు తిరిగేందుకూడా సిగ్గుపడటం లేదు. నా జీవితాని కల్లా ఒక్కటేలోటు; నాకు తోడునీడగావుండే ఒక స్త్రీ. నేను నిన్ను ఎన్నుకోవటంలో పొరబడలేదు—"

"నన్నా?" అందామె ఆశ్చర్యంతో.

"ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. విషయాన్ని మొదటినుంచీ పూసగుచ్చినట్టు నువ్వు ఎరుగుదువు. నా చేష్టలు నీకు అర్థంకానంత గూఢంగామాత్రం లేవు.

"నాకు అంత బాగా అర్థమైనట్టయితే విషయాన్ని ఇంత దూరం రానిచ్చేదాన్ని కాదు" అందామె కింది పెదవిని మునిపంటితో కొరుకుతూ.

నిరాశతో కుంగుతూ డాక్టర్ అన్నాడు; "శ్రీ!"

"నేను నిజం చెప్పాను. మీరు కష్టపడకండి."

"నీమీద ఎన్ని ఆశలు నిలుపుకున్నాను! నిన్ను అపార్థం చేసుకున్నట్టయితే నీ కోసం ఇంత శ్రమ పడేవాణ్ని కాదు."

"నాకోసం శ్రమపడ మన్నానా? ఐనా ఏం శ్రమ పడ్డారు?'!

"ఒక వ్యక్తికి ప్రాణం పోశాను— ఆ వ్యక్తిమీంద నీకు అభిమానం వుండటంవల్ల..."

"దానికి ఫీజు తీసు కోండి, మనుషుల హృదయాలు కాదు—"

"ఫీజా నాకు డబ్బులేకనా? ఇదే నువ్వు కాకుండా ఇంకెవ ,న్నా కోరివుంటే—అసలు ఒప్పుకోనేవాణ్ని కాదు"

"పోనీ నాకోసం చేశారు; నా మీంద మీంకు ఇంత అభి మానం వున్నందుకు కృతజ్ఞురాల్ని. మీరు దానికి ప్రతిఫలం కోరాలా? మన స్నేహాన్ని విలువకట్టి అమ్మాలని చూస్తు న్నారు. ఆ వెలను నేను ఇవ్వాలా? పోనీ అప్పుడే మీ రను కున్న యీ ఖరీదును మీ రెందుకు చెప్పలేదూ?"

డాక్టర్‌కు జవాబుదొరకలేదు. అతను చాలా సిగ్గుపడి పొయ్యాడు. ఎవరి తప్పయినా — ఒక పెద్ద పొరపాటు జరిగిపోయింది. కొంచెంసేపు నిశ్శబ్దంగా వున్నాక డాక్టర్ అడిగాడు: "పెళ్ళిఅసలు చేసుకోవా?" అతనికోపం కొంత చల్లాగిందని ఆ గొంతే చెప్తోంది.

"చేసుకుంటాను. స్త్రీకి అది చాలా అవసరమైందని నాకు తోస్తోంది."

"ఎవర్ని?" అన్నాడు డాక్టరు.

"మీ రోగిని—"

ఎవరూ ? అతనా ?'' అతనా ?'' అంతికన్న అసలామె
చేసుకోనని అంటే అతనికి ఆశ్చర్యం కలిగేది కాదు.
ామె 'ఔ' నన్నట్టు తలతిప్పింది.
'అతన్ని ప్రేమించావా ?'' అన్నాడు నిట్టూర్చి.
'ఆ మాట నా నోటిమీాసుగానే వినాలా ?''
'మరి నటించావ్ గా ?''

'నటన!'' అని హేళనగానవ్వి అంది : అది అసలు
చేతనే కాలేదనుకుంటాను. మొదట అనుకున్నాను;
ు అదంతా నటనేనని. తీరా ఇప్పుడు వెనక్కి తిరిగి
సుకుంటే—అదంతా నిజం! ఇంతదూరం పరిస్థితుల
త్తిడివల్ల ఎలా రాగలిగానో నాకే తెలియదు. నేను అను
ాడు : మన జీవితంలో ఏది నిజమనుకుంటున్నామో
కే నటన ! ఏది 'నటన' అని భ్రమపడుతున్నామో అదే
ం! ఈ రహస్యం నాకుఇప్పుడే తెలిసింది—''

డాక్టర్ బాగా ఆలోచించి అన్నాడు : నిజమే! నీ
స్వరూపాన్ని ఇప్పుడే చూడగలుగుతున్నాను. అది ఎంత
్యమైన నటనయి వుండకపోతే రోగి ఇంత త్వరలో ఆరో
్యన్ని పుంజుకొని వుంటాడో ఆలోచించ లేకుండా
న్నాను—''
ఇక మాట్లాడేందుకు మాటలే తెలియనట్టు నిశ్శబ్దంగా తను
ూన తిరిగివెళ్ళి పోయ్యాడు.

మరి నాలుగు రోజులకు శ్రీదేవి వివాహపు శుభలేఖతో పాటు డాక్టర్‌కు వెయ్యిరూపాయలకు చెక్ వొచ్చింది. దాని మీద శ్రీదేవి తండ్రి సంతకం వుంది. కవరులో శ్రీదేవి ఉత్తరంకూడా రాసింది :

"నూతన వధూవరుల అభినందనాల్లో—ప్రాణరక్షణార్థం మీ శ్రమకు ఇది ప్రతిఫలం. నా వివాహ సమస్యకు మీరు ఒకదారి చూపగలిగి...సమర్థుడైన వరుణ్ని వెదికి ఇవ్వగలిగినందుకు కృతజ్ఞురాల్ని—"

డాక్టర్ నిట్టూర్చి, ఇంటికప్పుకేసి కోపంతో చూశాడు;

—ఏప్రిల్ 1945

